ఈనాడు అమరావతి
కృష్ణా
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

ఆర్డీవోలకు స్థానచలనం

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో పని చేస్తున్న పలువురు ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం కలిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో పలువురు ఆర్డీవోలు బదిలీ అవగా ఆయా స్థానాల్లో కొత్తవారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణిని నూజివీడు ఆర్డీవోగా బదిలీ చేస్తూ ఆ స్థానంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎ.స్వాతిని నియమించారు. ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు నరసాపురానికి బదిలీ కాగా ఆయన స్థానంలో పి.సంపత్ హేలా షారోన్‌ను, విజయవాడ ఆర్అండ్ఆర్‌లో ఎస్డీసీగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును గుంటూరు ఆర్డీవోగా, శిక్షణ పూర్తి చేసుకున్న మాధురిని తిరువూరు ఆర్డీవోగా నియమించారు. గుడివాడ ఆర్డీవో పద్మావతిని జీఏడీ వద్ద రిపోర్ట్ చేయమని ఆదేశించడంతో పాటు గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న బాలసుబ్రహ్మణ్యంను ఆమె స్థానంలో నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.చైతన్యను విజయవాడ ఆర్డీవోగా, ఆరోగ్యశ్రీ ట్రస్టు ఎడిషనల్ సీఈవో కె.బాలకృష్ణను నందిగామ ఆర్డీవోగా, విజయవాడ అడిషనల్ కమిషనర్ ఎ.మహేష్‌ను ధర్మవరం ఆర్డీవోగా, ఎన్టీఆర్ జిల్లా కేఆర్సీసీ ఎస్డీసీగా పనిచేస్తున్న కిరణ్మయిని సూళ్లూరుపేట ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రెండున్నరేళ్లలో ఆదాయం రెట్టింపు

మోపిదేవి, న్యూస్‌టుడే: రెండున్నరేళ్లలో మోపిదేవి శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆదాయం రెట్టింపయ్యిందని చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022 జులై వరకు మూలధనం రూ.8 కోట్లు ఉండేదని, 2024 ఆగస్టు 31 నాటికి రూ.16 కోట్లకు చేరిందన్నారు. ప్రజాప్రతినిధుల చొరవతో సర్వశ్రేయోనిధి నుంచి రూ.1.5 కోట్లతో పుష్కరిణి అభివృద్ధి, రూ.40 లక్షలతో అన్నప్రసాద హాల్, రూ.15 లక్షలతో రెండు స్వాగత ద్వారాలు, రూ.50 లక్షలతో క్యూలైన్లు, రూ.2.75 కోట్లతో వ్యాపార సముదాయం, భక్తుల కోసం గదులు, రూ.20 లక్షలతో మురుగుకాల్వ, రూ.1.2 కోట్లతో కేశఖండన శాల, శౌచాలయం, రూ.60 లక్షలతో సౌర విద్యుత్తు ఏర్పాటుకు నిధులు మంజూరుకాగా కొన్ని పనులు చేపట్టాల్సి ఉందన్నారు. పెదకళ్లేపల్లి దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనుల కోసం రూ.1.30 కోట్లతో ఆమోదం వచ్చిందని, శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయంలో రూ.1.25 కోట్లతో 10 అభివృద్ధి పనులు ఆమోదించారన్నారు.

రైతుకు బలం.. చేనుకు జీవం..

అన్నదాతల ఖాతాల్లో పరిహారం జమ

న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట), బంటుమిల్లి

దెబ్బతిన్న వ్యవసాయ పంటల విస్తీర్ణం	22,873 హెక్టార్లు
నష్టపోయిన రైతులు	37,765
ప్రభుత్వ సాయం రూ. కోట్లు	56.70
దెబ్బతిన్న ఉద్యాన పంటల విస్తీర్ణం	3,179 హెక్టార్లు
నష్టపోయిన రైతులు	6,551
ప్రభుత్వ సాయం రూ. కోట్లు	10.42

వర్షాలు, వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో పంటలు ముంపుబారిన పడ్డాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలు రోజుల తరబడి నీళ్లల్లో ఉండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రతి రైతునీ ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం పంట నష్టం లెక్కలు తేల్చిన రోజుల వ్యవధిలోని వారి ఖాతాలకు సాయం జమ చేసింది. పంట నష్టం నమోదుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చి త్వరితగతిన సాయం అందించడంతో రైతులు తమ ఖాతాలకు నగదు జమ అయినట్లు చరవాణులకు వస్తున్న సంక్షిప్త సందేశాలు చూసుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బందరు మండలంలో దెబ్బతిన్న వరిపంట



తోట్లవల్లూరులో కుళ్లిపోయిన కందపంట

వ్యవసాయ పంటలకు రూ.56.70కోట్లు

జిల్లా వ్యాప్తంగా 41వేల హెక్టార్లలో పంటలు నీట మునగగా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నాట్లు వేసి 32 రోజులు దాటడంతో పాటు 33శాతానికి పైగా దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకుని యాప్‌లో నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బందరు, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలతో పాటు వరద ప్రభావిత ప్రాంతాలైన గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు, బాపులపాడు, చల్లపల్లి, అవనిగడ్డ తదితర మండలాల్లో పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 22,873 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు లెక్క తేల్చారు. 37,765 మంది రైతులు నష్టపోగా వారందరికీ ప్రభుత్వం సాయం విడుదల చేసింది. వరి, వేరుశనగ, పత్తి, చెరకు పంటలకు హెక్టారుకు రూ.25వేలు, మొక్కజొన్న, మినుముకు హెక్టారుకు రూ.15వేల చొప్పున సాయాన్ని రైతుల ఖాతాలకు జమ చేసింది.

ఉద్యాన పంటలకు రూ.10.42కోట్లు

వరితో పాటు తీరప్రాంత మండలాలైన తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఉయ్యూరు, మోపిదేవి, చల్లపల్లి, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లో అరటి, తమలపాకు, కంద ఇలా వివిధ రకాల తోటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటకు పెట్టుబడి ఎక్కువగా ఉండడంతో రూ.లక్షలు అప్పులు తెచ్చి పంటపై వెచ్చించామని, ఇప్పట్లో అప్పులు తీర్చలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా గ్రామాల్లో పర్యటించిన బృందాలు జరిగిన పంట నష్టాన్ని లెక్కించి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేశాయి. జిల్లాలో 3,179 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినగా 6,551 మంది రైతులు నష్టపోయారు. వారికి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంటలను బట్టి సాయాన్ని విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలకు రూ.10.42కోట్లు సాయం విడుదలైంది. సీఎం చంద్రబాబు సాయం విడుదల చేసిన తర్వాత గురువారం రాత్రి నుంచి రైతుల ఖాతాలకు జమ అయినట్లు వారి చరవాణులకు సంక్షిప్త సందేశాలు వస్తున్నాయి.

24 రోజులకే నష్టపరిహారం అందింది



– భోగిరెడ్డి సాంబశివరావు (కోసూరుపాలెం)

వరద వచ్చిన 24 రోజులకే నష్టపరిహారం ఇవ్వడం చాలా గొప్ప విషయం. గత వైకాపా ప్రభుత్వం ఆరునెలలకు బటన్ నొక్కి జమ చేశామని అనేవారు. కానీ ఖాతాలో మాత్రం మూడు, నాలుగు నెలలకు అదృష్టం ఉంటే పడేవి. ఇప్పుడు ఎకరాకు రూ.14వేలు అతి తక్కువ కాలంలో జమ చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

రూ.40వేలు ఖాతాలో పడ్డాయి



– దొప్పలపూడి జగదీష్ (బొబ్బర్లంక)

నేను వేసిన పసుపు పంట నీట మునిగింది. నెల కూడా పూర్తి కాకుండానే రూ.40వేల నష్టపరిహారం ఖాతాలో పడ్డాయి. తిరిగి స్వల్పకాలిక పంటలు వేసుకునేందుకు వీలు కలిగింది. అనుభవమున్న నాయకుల పరిపాలనకు ఇది నిదర్శనం. సకాలంలో పరిహారం అందించి రైతులను ఆదుకున్నారు.



బారికేడ్ల వద్దకు దూసుకొచ్చిన ఇరుపక్షాలను అదుపు చేస్తున్న పోలీసులు

బందరులో గంటపాటు ఉద్రిక్తత..

పరస్పర దూషణలతో జనసేన, వైకాపా శ్రేణుల నినాదాలు



పేర్ని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసైనికులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: జనసేనాని పవన్‌కల్యాణ్‌ను మాజీ మంత్రి, వైకాపా నాయకుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) విమర్శించడాన్ని ఖండిస్తూ జనసేన ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం గంట పాటు ఉద్రిక్తత, ఉద్విగ్నతలకు కారణమైంది. పవన్‌ను ఉద్దేశిస్తూ వైకాపా కార్యాలయంలో బుధవారం పేర్ని చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉదయం 12 గంటల సమయంలో జనసైనికులు, నాయకులు పేర్ని ఇంటికి చేరువగా రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. వారిని పేర్ని ఇంటి వరకూ వెళ్లనీయకుండా పోలీసులు రహదారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పేర్ని నాని బయటకు వచ్చి తమకు సమాధానం చెప్పాలంటూ జనసైనికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. పేర్ని ఇంటి వద్దకు చేరుకున్న వైకాపా కార్యకర్తలు, నాయకులతో కలిసి పేర్ని కిట్టూ పోలీసులు అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా బారికేడ్ల వరకూ దూసుకొచ్చారు. ఇరుపక్షాలు నినాదాలతో ఒకరినొకరు రెచ్చగొట్టుకునే ప్రయత్నం చేశారు. ఒంటి గంట సమయంలో జనసేన నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. వెనక్కు వెళ్లకుంటే అదుపులోకి తీసుకుంటామంటూ హెచ్చరించడంతో వైకాపా శ్రేణులు వెనుదిరిగాయి.

గన్నవరంలో ఘోర రోడ్డు ప్రమాదం

ఘటనా స్థలంలో ఇరువురు, చికిత్స పొందుతూ ఒకరి మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

గన్నవరం గ్రామీణం, జే పంగులూరు, న్యూస్‌టుడే: చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై గన్నవరం శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం కోటపాడుకు చెందిన పల్లెపోగు ప్రేమమ్మ(45) క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమె చికిత్స నిమిత్తం ఈ నెల 24న భర్త ఆదాం, వరుసకు కొడుకు అయిన పల్లెపోగు మురారీ, బంధువులైన ఆరికట్లవారిపాలేనికి చెందిన కూరగంటి మార్క్(25), కొండమంజులూరుకు చెందిన పోలేపోగు మేరీ(40) కారులో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఆసుపత్రిలో చూపించుకొని బుధవారం తిరుగు ప్రయాణమవ్వగా గురువారం అర్ధరాత్రి 02.30 గంటలకు మార్గమధ్యలోని గన్నవరం చేరుకున్నారు. స్థానిక భారత్ పెట్రోల్ బంకు సమీపంలోకి చేరుకొనేసరికి కారు నడుపుతున్న పల్లెపోగు ఆదాం నిద్రమత్తులో ఒక్కసారిగా రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో కూరగంటి మార్క్(25), పోలేపోగు మేరీ(40) అక్కడికక్కడే మృతిచెందగా.. ఆదాం, ప్రేమమ్మ, మురారీలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు పోలీసుల సాయంతో క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రేమమ్మ చికిత్స పొందుతూ మరణించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మార్క్‌కు భార్య, బాబు సంతానం కాగా మేరీకి ముగ్గురు పిల్లలున్నారు.

5000 మందితో బందోబస్తు

దసరా ఉత్సవాలకు ఏడు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ■ నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇవి 12 వరకు కొనసాగనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో దుర్గమ్మ దర్శనార్థం వస్తుంటారు. ఈ సందర్భంగా క్యూలైన్ల నిర్వహణ, బందోబస్తు, చోరీలు జరగకుండా నగర పోలీసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా లోటుపాట్లకు తావులేకుండా కసరత్తు చేస్తున్నారు. వీఐపీల రాకతో సామాన్య భక్తులు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉత్సవాలకు దాదాపు ఐదు వేల మంది అధికారులు, సిబ్బందిని మోహరిస్తున్నారు.

రద్దీకి తగ్గట్లుగా సిబ్బంది..

అమ్మవారి దర్శనార్థం సాధారణ రోజుల్లో రోజుకు లక్ష మంది చొప్పున, మూలా నక్షత్రం రోజు 2.5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా. దసరా రోజు నిర్వహించే తెప్పోత్సవం సందర్భంగా రెండు లక్షల మంది వరకు దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో కొండపైన, దిగువన ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణకు నగర కమిషనరేట్‌లోని



సిబ్బందికి తోడుగా వివిధ జిల్లాల నుంచీ పోలీసులను పిలిపిస్తున్నారు. తొమ్మిది రోజులపాటు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రోజుకు మూడు షిఫ్టుల్లో విధులు కేటాయించనున్నారు. సాధ్యమైనంత ఎక్కువ మందిని ఆలయం, దుర్గాఘాట్, చుట్టుపక్కల ప్రాంతాల్లో వినియోగించనున్నారు. భక్తుల రద్దీ తట్టుకునేలా పలు క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో తొక్కిసలాటకు తావులేకుండా ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో దాదాపు 15వేల మంది వరకు వేచి ఉండే అవకాశం ఉంది.

అణువణువునా నిఘా..

ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి దృశ్యాలను చూసేందుకు 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లో సిబ్బందికి విధులు కేటాయిస్తున్నారు. లక్షల్లో భక్తులు వస్తున్నందున నేరస్థుల కదలికలపైనా నిఘా ఉంచబోతున్నారు. చోరీలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు, సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నియమించనున్నారు. డ్రోన్లతో అవసరమైన చోట్ల చిత్రీకరిస్తారు. అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లాల దొంగలు వచ్చే వీలున్నందున, వారిని పసిగట్టి అదుపులోకి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక సమాచార కేంద్రాలు...

వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం పోలీసు సేవాదళ్ వాలంటీర్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి షిఫ్ట్‌లో ఉండే వాలంటీర్లు నడవలేని వారిని సాయం చేస్తారు. ఆలయానికి సొంత వాహనాల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం సమీపంలో పలు చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. దాదాపు ఏడు చోట్ల ద్విచక్ర వాహనాలు, కార్లు నిలిపేందుకు ఆస్కారం ఉంది. భక్తుల సౌకర్యార్థం వివిధ చోట్ల పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో రద్దీ ఎలా ఉందో ఇక్కడ తెలుసుకోవచ్చు. పరిస్థితిని బట్టి దర్శనానికి వెళ్లొచ్చు. దీంతో అనవసర రద్దీ తగ్గే వీలుందని అంచనా వేస్తున్నారు.

దుర్గ గుడి అభివృద్ధి పనుల పరిశీలన



ఈవో రామారావుతో మాట్లాడుతున్న నిపుణుల బృంద సభ్యులు కొండలరావు, సుబ్రహ్మణ్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గాగుడిలో చేపట్టిన అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ నియమించిన నిపుణుల బృందం గురువారం పరిశీలించింది. దుర్గ గుడి ఘాట్ రోడ్డు వద్ద రిటైనింగ్ గోడ నిర్మాణం, ఘాట్ రోడ్డులో రాక్ మిటిగేషన్ పనులు, మల్లేశ్వరాలయం మెట్ల వద్ద నిర్మించిన ఫుట్ బ్రిడ్జి, అన్నదానం, ప్రసాదాల పోటు నిర్మాణ పనులను విశ్రాంత ఇంజినీర్ కొండలరావు పర్యవేక్షణలోని బృందం పరిశీలించి పలు సూచనలు చేసింది. రాక్ మిటిగేషన్ పనులు దసరా ఏర్పాట్లకు ఆటంకం కలగకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, వైకుంఠరావు, రమేష్ సీఈ శేఖర్, విశ్రాంత ఎస్ఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజలతో కొట్టించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు: కొల్లు



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఏమాత్రం పరివర్తన లేకుండా కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్న వైకాపా నాయకులు ప్రజాతిరుగుబాటుతో కొట్టించుకునే పరిస్థితులు తెచ్చుకోవద్దంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మచిలీపట్నంలో ఆయన గురువారం మాట్లాడుతూ ఐదేళ్ల అధికారం మాటున చేసిన లెక్కలేనంత అవినీతి, అరాచకాలకు స్పష్టమైన ఆధారాలు కన్పిస్తున్నా ఇంకా అసత్యాలతో బుకాయించడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. మూడు నెలలుగా కలుగులో దాక్కున్న ఎలుకల్లా కన్పించకుండా పోయిన కొడాలి నాని, వల్లభనేని వంశీలతో కలిసి మాజీ మంత్రి పేర్ని నాని బుధవారం విలేకరుల సమావేశంలో అవాకులు చెవాకులు పేలారంటూ తప్పుపట్టారు. ఎన్నికల ముందు వరకూ ఎన్నో సవాళ్లు, రాజకీయ సన్యాసం వంటి ప్రేలాపనలు పేలి, ఎన్నికల తర్వాత తోక ముడిచింది చాలక, మళ్లీ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను ఏకవచనాలతో సంబోధిస్తూ ఇష్టానుసారం విమర్శలు చేస్తే ప్రజలు ఏమాత్రం సహించే స్థితిలో లేరన్నారు. రవాణాశాఖ మంత్రిగా పనిచేసిన పేర్ని నాని సొంత నియోజకవర్గ కేంద్రమైన మచిలీపట్నం బస్టాండులో వర్షం పడితే నడుములోతు నీళ్లు నిలిచే దుస్థితిని నివారించలేని అశక్తుడిగా మిగిలిపోయారన్నారు. వైకాపా నాయకులకు ఏమాత్రం అభిమానం ఉన్నా తమ ఐదేళ్ల పాలన, కూటమి ప్రభుత్వ మూడు నెలల పాలనపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు పేర్ని మచిలీపట్నంలోని కుమ్మరిగూడెంలో రూ.కోట్ల విలువ చేసే 26 ఎకరాల ప్రభుత్వ మడుగు భూమిలో పలువురు బినామీ లబ్ధిదారులతో బలవంతంగా షెడ్లు వేయించారని, ఈ విషయాన్ని తాము వ్యతిరేకించినా అధికార మదంతో ఏమాత్రం పట్టించుకోని విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రెండు రోజుల కిందట చట్ట ప్రకారం నగర కార్పొరేషన్ ఆ భూములను స్వాధీనం చేసుకుంటే గగ్గోలు పెడుతున్నారన్నారు. ఒకవేళ అర్హులైన వారికే స్థలాలు కేటాయిస్తే వారిని ప్రస్తుతం రోడ్డున పడేసిన పాపం పేర్నిదే అన్నారు. స్థల స్వాధీనంలో ఎవరైనా నిరుపేద బాధితులు ఉంటే రాజకీయాలకు అతీతంగా వారికి వేరే ప్రాంతంలో రెండు సెంట్ల స్థలం ఇచ్చి గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. తిరుమల ప్రసాదం కల్తీ విషయంలో బాధ్యులైన ఏ ఒక్కరూ తప్పించుకోలేరని, చట్టప్రకారం కఠిన శిక్ష అనుభవించక తప్పదని స్పష్టం చేశారు.

దారులు.. ప్రమాదాలకు నిలయాలు

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు పాత రాజీవ్‌నగర్‌కు చెందిన లింగమనేని ప్రభుకుమార్ ఇల్లు మునిగిపోయింది. దీంతో కుటుంబ సభ్యులతో గుణదలలోని తన మేనమామ ఇంట్లో తల దాచుకున్నారు. వరద తగ్గిన తర్వాత తల్లి కృష్ణకుమారితో పాటు వెళ్లి ఇంటిని శుభ్రం చేసుకున్నారు. తిరిగి రాజీవ్‌నగర్ నుంచి గుణదల బంధువుల ఇంటికి తల్లికొడుకులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా రామవరప్పాడు రింగ్ వద్ద బైక్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన కృష్ణకుమారి, ప్రభుకుమార్ అక్కడికక్కడే మృతి చెందారు.

✤ ఈ ఏడాది ఆగస్టు 28న గుణదలకు చెందిన దిల్షాద్ ఆటోనగర్ స్టీల్ కంపెనీలో విధులు ముగించుకుని రామవరప్పాడు సాయిబాబా ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా గన్నవరం వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఆమెను ఢీకొంది. ప్రమాదంలో లారీ వెనుక చక్రాలు ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది.



రామవరప్పాడు రింగ్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న యువకుడు

గత నాలుగేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు..

ఏడాది	గాయపడినది	రోడ్డు దాటేటప్పుడు చనిపోయింది	ప్రమాదంలో మృతి చెందినది
2020	22	12	12
2021	30	15	17
2022	35	17	22
2023	45	20	22
2024 (ఆగస్టు వరకు)	35	14	17

నివారణ చర్యలు శూన్యం

విజయవాడ నగరం మీదుగా వెళ్తున్న 16 జాతీయ రహదారి ప్రతి ఏటా పలువురి ప్రయాణికుల ఉసురు తీస్తోంది. రెప్పపాటులో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నగరంలోనే అత్యధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు రామవరప్పాడు జాతీయ రహదారిపై చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు ఉన్న రోడ్డుపై ప్రయాణమంటే ప్రజలు అరచేతిలో ప్రాణాలను పెట్టుకుని వెళ్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో వేల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి విజయవాడకు విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వేలాది మంది వస్తుంటారు. రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు రహదారి ఇరుకుగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు ఈ రోడ్డులో ఎక్కడా ఫుట్ బ్రిడ్జి లేకపోవడంతో పాదచారులు రహదారి దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఇలా చేస్తే మేలు..

✤ రోడ్డు విభాగిని దాటకుండా ఇనుప గ్రిల్ ఏర్పాటు. ✤ ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగ నిరోధకాలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి.

✤ అవసరమైన ప్రాంతాల్లో నడక వంతెనలు నిర్మించాలి. ✤ రోడ్డు దాటేందుకు కొన్ని ప్రాంతాలు ఎంపిక చేసి, అక్కడ బ్లింకర్లతో పాటు జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలి. ✤ జాతీయ రహదారిపై విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. ✤ ట్రాఫిక్, ఎన్‌హెచ్ఎఐ, రవాణా శాఖ అధికారులు మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలి. ✤ స్పీడ్‌గన్‌లు అమర్చి వేగ పరిమితిని తగ్గించాలి. ✤ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి. ✤ వాహన నిబంధనలపై తరుచూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ✤ ప్రతి కూడలి వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేసి సిబ్బందిని కేటాయించాలి. ✤ హిట్ అండ్ రన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.

ప్రమాదకర ప్రాంతాలు

(మహానాడు జంక్షన్, రామవరప్పాడు కూడలి, రామవరప్పాడు ఆంజనేయ స్వామి ఆలయం, పేరంటాలమ్మ దేవాలయం ఎదుట, ఫోర్డ్ షోరూం ఎదుట, శక్తి కల్యాణ మండపం వద్ద, ఎస్ఈఆర్ సెంటర్, ఎస్ఆర్‌కే కళాశాల సమీపంలో, బెస్ట్‌ప్రైస్ ఎదుట, నిడమానూరు బ్రిడ్జి వద్ద, వాల్వో షోరూం ఎదుట, గూడవల్లి సెంటర్ తదితర ప్రాంతాలు.

‘నూతన మద్యం విధానం సవరించాలి’

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి అమలు చేయనున్న మద్యం నూతన విధానంలో సవరణలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ కోరారు. ఎక్కువ ఆదాయం వచ్చేలా దుకాణాలు పెంచడం, రూ.99కే మద్యం అందించడం సరికాదన్నారు. మహిళా సంఘాల ఐక్యవేదిక, భారత జాతీయ మహిళా సమాఖ్య, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం దాసరి భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా 2600 మద్యం దుకాణాలు పెంచడం, ప్రైవేటు వ్యక్తులకు లైసెన్స్‌లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి రూ.2వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. ఇది పేద ప్రజల జీవితాలను మరింత చీకటిమయం చేయడమేనని పేర్కొన్నారు. యువత బానిసవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. అనర్థాలపై ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. మద్యానికి బానిసై మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, డి ఎడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్యం అందించాలని కోరారు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. అమ్మకాలను నియంత్రించాలని, ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 వరకు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ.. మద్యం విధానంలో మార్పులు కోరుతూ అక్టోబరు 2న జిల్లా, మండల కేంద్రాల్లో మహాత్మా గాంధీ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. మహిళలు, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల నాయకులు ధారా బిందు, అరుణ్‌కుమార్, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, డి.సీతారావమ్మ, లంక నాగమణి, దుర్గాసి రమణమ్మ, చింతాడ పార్వతి, బి.శాంతి, రాహేలమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గాభవానీ. చిత్రంలో పద్మశ్రీ, రమాదేవి తదితరులు

చట్టాలపై అవగాహనతో ఉండాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని జిల్లా జడ్జి అరుణసారిక అన్నారు. గురువారం తపాలా శాఖ ఉద్యోగులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలోని తపాలాశాఖ కార్యాలయంలో ఆ శాఖాపరంగా అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ మచిలీపట్నం సూపరింటెండెంట్ కె.ఆదినారాయణ వివిధ పథకాలు, పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్ తదితర సేవల గురించి వివరించారు. అనంతరం న్యాయసేవా సదన్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి వివిధ చట్టాల గురించి వివరించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ న్యాయసేవలను అందుబాటులో అందిస్తున్నందున అందరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బూరగడ్డ ఆశోక్‌కుమార్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, తపాలాశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



తపాలాశాఖ ఏర్పాటు చేసిన పథకాల ప్రదర్శన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి అరుణసారిక

సిట్ నివేదిక వచ్చే వరకు మౌనం పాటించాలి: సీపీఎం

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: తిరుమల ప్రసాదం కల్తీ విషయంలో సిట్ నివేదిక వచ్చే వరకు రాజకీయ పక్షాలు మౌనం పాటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మచిలీపట్నంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మతం అనేది ప్రతి ఒక్కరి వ్యక్తిగత విశ్వాసంతో కూడి ఉంటుందని, దేవుడి పేరుతో మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టాలనుకునే ప్రయత్నాలు సరికాదన్నారు. ప్రసాదం, కల్తీ నెయ్యి విషయంలో వాస్తవాలు తేల్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే సిట్ దర్యాప్తునకు ఆదేశించిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక పేరుకే పరిమితమైందని, నేటికీ అందుబాటులోకి రాకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే ఉచిత ఇసుక విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యాన అక్టోబరు 4న రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడుతున్నట్లు వివరించారు.



సమావేశంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

తిరుమల లడ్డూలో కల్తీపై నిరసన

శ్రీకాకుళం, (ఘంటసాల), న్యూస్‌టుడే: తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్తీ నెయ్యి ఘటనను నిరసిస్తూ కూటమి నాయకుల ఆధ్వర్యంలో సంప్రోక్షణ పూజలు గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శాస్త్రోక్తంగా విశేష పూజలు చేశారు. మొదట బుద్ధప్రసాద్‌ను ఆలయ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామకృష్ణ ప్రసాద్, రుత్వికులు భాస్కరాచార్యులు బృందం ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కూటమి నాయకులు సర్పంచులు రవిప్రసాద్, నాగశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నాయకులను సత్కరిస్తున్న రుత్వికుల బృందం

వేకనూరు (అవనిగడ్డ గ్రామీణం): ప్రభుత్వాలు సనాతన ధర్మాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని పలువురు భక్తులు పేర్కొన్నారు. స్థానిక సంతాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్థులు స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదం కల్తీకి పాల్పడడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

30న ఏఎన్‌యూకు వెంకయ్యనాయుడి రాక

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈనెల 30న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రానున్నారు. పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంత్యోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర ఈ సభలో పాల్గొననున్నారు. సభ నిర్వహణకు ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య గంగాధర్ 8 కమిటీలను నియమించారు. ఆహ్వానం, సేవలు, సన్మానం, రవాణా, మీడియా, అకడమిక్ తదితర కమిటీలతో ఆచార్య గంగాధర్ సమావేశమయ్యారు.

తిరుమలకు వెళ్లేముందు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

లంకా దినకర్ డిమాండ్

ఈనాడు-అమరావతి:: ‘వైకాపా అధినేత జగన్ క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నారు. ఈ విషయం అందరికీ తెలుసు. నచ్చిన మత విశ్వాసాన్ని అనుసరించడం అందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ...జగన్ హిందూ దేవాలయాలలోనికి ప్రవేశించాలనుకున్నపుడు..హిందూ విశ్వాసాల ఆచారాలు, సంప్రదాయాలు, నియమాలు, నిబంధనలను గౌరవించాల్సిందే’ అని భాజపా ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన జారీచేశారు. ‘హిందువులు కానివారు డిక్లరేషన్ ద్వారా మాత్రమే వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి అర్హులు. తిరుమలలో ప్రవేశించడానికి ముందుగానే తప్పనిసరిగా హిందువేతరుడిగా డిక్లరేషన్ ఇవ్వాల్సిందే. అంతేకాకుండా..తన పాలనలో రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరిగిన అఘాయిత్యాలు, తిరుమల లడ్డూ ప్రసాదంలో నాసిరకం నెయ్యి వినియోగంపై ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. దీనికి భిన్నంగా ఆయన వ్యవహరిస్తూ హిందూ మతం ఆచారాలు, సంప్రదాయాలు, ఆచారాలు, పద్ధతులను అవహేళన చేస్తూ రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు’ అని లంకా దినకర్ మండిపడ్డారు.

చేసిన పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికే కాలినడక పేరుతో కొత్తనాటకం

మాజీముఖ్యమంత్రి జగన్‌పై నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజం

ఈనాడు డిజిటల్, అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపిన పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికి, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే తిరుమలకు కాలినడక పేరుతో మాజీముఖ్యమంత్రి జగన్ కొత్తనాటకం మొదలుపెట్టారని తెదేపా అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. పాపం మీ హయాంలో జరిగితే...ఇప్పుడు ప్రక్షాళన అంటూ పూజలకు పిలుపునివ్వడం అర్థరహితమని జగన్‌పై గురువారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. “జగన్‌రెడ్డి కుటుంబం మొత్తం క్రైస్తవ మతాన్ని ఆచరిస్తుంది. ఈ సారి జగన్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేప్పుడు ఆయన కచ్చితంగా డిక్లరేషన్ మీద సంతకం పెట్టాలి. అలా కాకుండా గుడిలోకి వెళ్లాలని ప్రయత్నిస్తే హిందువుల్ని అవమానించినట్టే” అని విజయ్‌కుమార్ మండిపడ్డారు.

చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్..!

పరమపదోత్సవం పేరుతో వేడుకలు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్ అంటూ ఓ రచయిత పాత సినిమాలో పాట రాశారు. దీన్ని నిజం చేస్తూ బాపులపాడు మండలం కాకులపాడులో ఇటీవల మృతి చెందిన తమ తండ్రికి పరమపదోత్సవం పేరుతో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు కుమారులు. కాకులపాడుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యలమంచిలి కోటేశ్వరరావు(90) ఈ నెల 9న అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో పెద్దకర్మ జరిగిన వారం తర్వాత గురువారం గుంటూరు జిల్లా నదిగడ్డపాలేనికి చెందిన చినజీయర్ స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో పరమపదోత్సవం పేరుతో సంబరాలు చేపట్టారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు, సంకీర్తనలతో సందడి చేశారు. అనంతరం కోటేశ్వరరావు ముగ్గురు కుమారులు శ్రీరామచంద్రమూర్తి, రవీంద్రకుమార్, కృష్ణకిషోర్ తండ్రి చిత్రపటాలను చేతబూని, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులతో కలిసి మేళతాళాలతో ప్రదర్శన నిర్వహించారు.



ఊరేగింపులో బంధువులు, గ్రామస్థులు

బ్రాయిలర్ ధరలు (కిలో ఒకి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

డీటీపాలెంలో ఇరువర్గాల ఘర్షణ

పెడన, న్యూస్‌టుడే: స్థానిక 19వ వార్డు దక్షిణ తెలుగుపాలెం(డీటీ)లో ఇరువర్గాలు గురువారం ఘర్షణకు దిగాయి. వేగంగా బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని అలా వెళ్ల వద్దు, వేగం తగ్గించాలని కొందరు సూచించడంతో ఈ వివాదం చెలరేగింది. చివరకు ఈ వివాదం తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌కు భారీగా తరలివచ్చి పరస్పర ఫిర్యాదులు అందజేశారు. ఇరువర్గాలతో మాట్లాడిన ఇన్‌ఛార్జి ఎస్సై లక్ష్మీ నరసింహమూర్తి ఘర్షణలకు దారితీసిన పరిస్థితులను తెలుసుకున్నారు. వైకాపా తరపున కౌన్సిలర్ చిరువెళ్ల జయేష్, తెదేపా తరపున వార్డు ఇన్‌ఛార్జి పరసా జితేంద్రలు అక్కడికి వచ్చారు.

వంగవీటి రాధాకృష్ణకు స్వల్ప గుండెపోటు

గవర్నర్‌పేట: మాజీ శాసనసభ్యుడు వంగవీటి మోహనరంగా తనయుడు రాధాకృష్ణ స్వల్ప గుండెపోటుకు గురయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉంటున్న ఆయనకు.. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఛాతిలో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయన్ని గవర్నర్‌పేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేయగా. . స్వల్పంగా గుండెపోటు వచ్చినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే చికిత్స చేశారు.



పేర్ని నాని చిత్రానికి చెప్పుతో కొడుతున్న జనసైనికులు

పేర్ని నాని వ్యాఖ్యలపై జనసైనికుల నిరసన

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తూ గుడివాడ నెహ్రూ చౌక్‌లో జనసేన నాయకులు గురువారం రాత్రి నాని చిత్రానికి చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పేర్ని నాని ఇటీవల గుడివాడ వచ్చి పోలీసులను అడ్డం పెట్టుకొని పరారయ్యారని.. లేకుంటే జనసేన సత్తా చూపించేవారమన్నారు. ఇంట్లో లేదా వైకాపా కేంద్ర కార్యాలయంలో కాకుండా బయటకు వచ్చి పవన్ కల్యాణ్‌ను, కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలు ఏ విధంగా తరిమి కొడతారో తెలుస్తుందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా పోలీసుల కాపలాతోనే బయటకు వచ్చే పేర్నిని జనం చిత్తుగా ఓడించినా సిగ్గురాలేదని చెప్పులతో కొడుతున్నామన్నారు. జనసేన నాయకులు సందు పవన్, కోయిలాపు రాము, పంచకర్ల అమర్, కోరపాటి విజయ్, చింతా రామకృష్ణ, వీర మహిళలు అర్జా మోనాలిసా, శీతల సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: వానపాములలో గంజాయి, మద్యం తాగుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొన్ని నెలలుగా గంజాయి విక్రయాలు, మద్యం తాగుతున్న వ్యక్తుల ఆగడాలు ఎక్కువ కావడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్పీ ఆదేశాల మేర కు దాడులు నిర్వహించామన్నారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పాడేరు మన్యం నుంచి బుచ్చెయ్యపేట మీదుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు దిబ్బిడి సమీపంలో గురువారం పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై శ్రీనివాసరావు కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన డి.వెంకట చరణ్‌సాయి, డి.ఎలీషా శామ్యూల్ బైక్‌పై వస్తుండగా ముందస్తు సమాచారంతో దిబ్బిడి వంతెన అడ్డగించి పోలీసులు తనిఖీ చేశారు. వారి వద్ద ఆరు కేజీల గంజాయి లభ్యం కాగా స్వాధీనం చేసుకుని ఇద్దర్నీ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు.

కొంగంచెర్ల ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం కొంగంచెర్ల ఉపాధి హామీ పథకంలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఈ గ్రామంలో గతేడాది దాదాపు రూ.25 లక్షల విలువైన పనులు జరగ్గా అధిక శాతం నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ గ్రామ క్షేత్రసహాయకుడ్ని అధికారులు రాజీనామా చేయించి మరొకరికి ఆ బాధ్యతలు అప్పగించారు. ప్రధానంగా చెరువులు, పంట బోదెల తవ్వకాల్లో పనులు పూర్తవకుండానే చేసినట్లు చెక్ మెజర్‌మెంట్ చేసి బిల్లులు చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ జరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఈ అక్రమాలపై దృష్టి సారించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెరుగైన ఫలితాలకు కృషి చేయాలి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : పదిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సుల్తానా సూచించారు. గన్నవరం బాలిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ పురోగతిపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంఈవో రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల భవనాలకు మెరుగులు, విద్యలో నాణ్యత ప్రమాణాలు, ఆవరణలో స్వచ్ఛత, మధ్యాహ్నం పథక అమలు ఇతర విషయాలపై హెచ్ఎంలకు పలు సూచనలు, సలహాలు చేశారు. తొలుత వ్యర్థాలతో విద్యార్థులు రూపొందించిన కళాకృతులను పరిశీలించారు. బాల్యం నుంచే పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు సృజనాత్మకత జోడించి పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దడాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎంఈవో సాంబశివరావు, కమల, రామబాలసింగ్, హెచ్ఎంలు ఝాన్సీ లక్ష్మి, జగదీశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యర్థాలతో రూపొందించిన కళాకృతులను పరిశీలిస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన



బాధ్యతలు చేపట్టిన హరిబాబుతో ఉద్యోగులు, గ్రామస్థులు

సర్పంచిగా హరిబాబు బాధ్యతల స్వీకారం

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ సర్పంచిగా బొడ్డు హరిబాబు గురువారం బాధ్యతలను చేపట్టారు. పంచాయతీ కార్యాలయానికి గురువారం వచ్చిన ఆయనను సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు అభినందించారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత

పెడన: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ మస్తం గోపాలరావు అన్నారు. స్థానిక 19, 20 వార్డుల్లో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు జయేష్, కరుణకుమారి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపికిషోర్, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.



20వ వార్డులో అవగాహన ప్రదర్శన

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల పక్కన వేసిన చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో అక్కడకు పశువులు చేరుతున్నాయి. దీని వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా దీనిపై వార్డు ప్రధానలు అధికారులకు సమస్యలను వివరించగా వెంటనే స్పందించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్సీ కార్యాలయ సమీపంలో రహదారి పక్కన చెత్త తొలగిస్తున్న కార్మికులు

? నగరంలోని శివగంగ ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన లీకు కారణంగా తాగు నీరు వృథాగా పోతోంది. ఇటీవల సిబ్బంది వచ్చి చూసివెళ్లారు. కానీ ఇంకా అలాగే ఉంది. -హేమసుందరరావు



వృథాగా పోతున్న నీరు

✔ సిబ్బందిని పంపి వెంటనే లీకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. -బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్, మచిలీపట్నం.

- న్యూస్‌టుడే మచిలీపట్నం కార్పొరేషన్

? బ్రహ్మపురంలో కలెక్టరేట్ పక్క రోడ్డులో చెత్త రోజుల తరబడి తొలగించడం లేదు.

-వెంకటేశ్వరరావు, బ్రహ్మపురం, మచిలీపట్నం

✔ సిబ్బందిని పంపి చెత్తను తొలగిస్తాం.

–శానిటరీ ఇన్‌స్పెక్టర్, మచిలీపట్నం కార్పొరేషన్.

- న్యూస్‌టుడే, భాస్కరపురం(మచిలీపట్నం)

పల్లెకు నిధులు.. ప్రగతి బాటలు..

న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడి పల్లెలు అధ్వానంగా తయారయ్యాయి. పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘ నిధులు కూడా మళ్లించడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో సర్పంచులు ఉండిపోయారు. వారు కోరుకున్నట్లు ప్రస్తుత ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ చేపట్టింది. గ్రామాల వారీగా అభివృద్ధి ప్రణాళిక ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న సర్పంచులు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గతంలో లేని విధంగా పల్లెలు కొత్త శోభ సంతరించుకుంటున్నాయి.

మండలం	గ్రామాలు
బందరు	34
పెడన	24
గూడూరు	27
బంటుమిల్లి	21
కృత్తివెన్ను	16



పినగూడూరులంకలో రోడ్డు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి..



గూడూరు: ఆకులమన్నాడులో జేసీబీతో పొదల తొలగింపు

ప్రతి గ్రామంలోనూ పనులు

అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక పల్లెజనం అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు బందరు, పెడన నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళిక రూపొందించారు. ఇటీవల ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో సర్పంచులు పనులు చేపడుతున్నారు. రోడ్ల పక్కనున్న ముళ్లపొదలు తొలగింపు, తాగునీరు, వీధి దీపాలు, అంతర్గత రహదారుల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఉపాధిహామీ నిధులు కూడా మండలానికి రూ.కోట్ల వరకు కేటాయించారు. వీటితో రోడ్లు, సీసీ డ్రైన్లు చేపడుతున్నారు.

నిబంధనలకు అనుగుణంగా..

గ్రామాల్లోని జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘ నిధులు కేటాయిస్తారు. టైడ్ ఫండ్స్ కేంద్ర నిబంధనల ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంటుంది. వీటిని తాగునీరు, పారిశుద్ధ్యం, నీటి వనరుల సంరక్షణ, తదితర పనులకు మాత్రమే వెచ్చించాల్సి ఉంటుంది. మిగిలిన 50శాతం అన్‌టైడ్ ఫండ్స్‌ను పంచాయతీల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల జీతభత్యాలకు మినహాయించి మిగిలిన పనులకు వెచ్చించడానికి అవకాశం ఉంది. ఇలా నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా నిధులను వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

సంతోషంగా ఉంది



పంచాయతీలను అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. గత వైకాపా ప్రభుత్వం ఆర్థిక సంఘ నిధులను మళ్లించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం అభివృద్ధి చేయగలమన్న భరోసా ఏర్పడింది.

- పంచకర్ల సురేష్, సర్పంచి, ఉరిమి, పెడన మండలం

రూ.2 లక్షలకు పైగా వచ్చాయి



మా పంచాయతీకి రూ.2లక్షలకు పైగా ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతం గ్రామంలో జంగిల్ క్లియరెన్స్, లోతట్టు ప్రాంతాల చదును తదితర పనులు చేపట్టాం. ఇంకా అనేక వసతులు కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం పనులు చేస్తుండటంతో ప్రజల్లో ధైర్యంగా వెళ్లగలుగుతున్నాం. మరో విడత నిధులు త్వరలోనే వస్తాయని అధికారులు అంటున్నారు. అవి కూడా వస్తే చాలా వరకు సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

- మహ్మద్ రఫీ, సర్పంచి, ఆకులమన్నాడు, గూడూరు మండలం

గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా పంచాయతీ అధికారులు మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులు, ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు.

గృహనిర్మాణాల్ని వేగవంతం చేయాలి

పెడన(గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలో గృహ నిర్మాణాల్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో వీరమల్లు రెడ్డయ్య కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల గృహ నిర్మాణ ప్రగతిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో 36 లేఅవుట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో 882 గృహాలు మంజూరయ్యాయని వివరించారు. 608 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా 274 వేర్వేరు దశల్లో ఉన్నాయన్నారు. వీటిని 2025 మార్చిలోపు లబ్ధిదారులు పూర్తి చేయాలని సూచించారు. మండల గృహ నిర్మాణ ఏఈ మాధవి మాట్లాడుతూ అన్ని లేఅవుట్లకు ప్రత్యేకాధికారుల్ని నియమించినట్లు తెలిపారు.

న్యూహోప్ సహకారంతో చేతిపంపుల ఏర్పాటు

తాళ్లపాలెం (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: తాళ్లపాలెం పంచాయతీ పరిధిలో నిర్మించిన రెండు చేతిపంపులను గ్రామ తెదేపా అధ్యక్షుడు కొనకళ్ల నాగరాజు గురువారం ప్రారంభించారు. న్యూహోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు మోషే సహకారంతో కొన్నలవారిమోడ్ గ్రామంలో ఒకటి, తాళ్లపాలెంలో రెండోది ఏర్పాటు చేశారు. రెండు చేతి పంపుల నిర్మాణానికి రూ.60వేలు వ్యయమైంది. మోషే సహకారంతో గతంలో కూడా తాళ్లపాలెంలో 18 చేతిపంపులను ఏర్పాటు చేశామని నాగరాజు తెలిపారు. గ్రామస్థుల అవసరాలు తీరుస్తున్న మోషేకు ధన్యవాదాలు తెలిపారు.

కళాకారులతో ప్రచారం

బంటుమిల్లి, న్యూస్‌టుడే: బంటుమిల్లిలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాభారతి కల్చరల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో గురువారం కళాకారులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే ఇబ్బందులు, పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను కళాకారులు పాటలు, పద్యాల రూపంలో వివరించారు. నాగభూపతి, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ నియామకం

పెడన: పెడన సబ్‌రిజిస్ట్రార్‌గా ఎల్.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. మొవ్వ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ ఆర్ఆర్.శేఖర్ బంటుమిల్లికి బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు మండల లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వీడ్కోలు పలికారు. రామ్మోహనరావు, ఉమానాగ మల్లికార్జునరావు, మోహనరావు, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత నినాదం అందరి విధానం కావాలి



పద్మావతి బీఈడీ కళాశాలలో ర్యాలీ

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్వచ్ఛత నినాదం అందరి విధానం కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం నగరంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యక్రమాన్ని కమిషనర్ పర్యవేక్షించారు. పద్మావతి బీఈడీ కళాశాలలో ర్యాలీతో పాటు మొక్కలు నాటారు. కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, కళాశాల ప్రిన్సిపల్ వి.వి.శైలజ, తెదేపా నాయకులు పీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. లేడియాంప్తిల్ కళాశాలలో పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించగా జిల్లా పర్యాటక శాఖాధికారి రామ్‌లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రిన్సిపల్ వి.సుందరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరినాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సయ్యద్ సాలార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

చిట్టిపాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సయ్యద్ సాలార్‌ను గురువారం చిట్టిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ బృందం సన్మానించింది. చిట్టిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సయ్యద్ సాలార్ హిందీ సబ్జెక్టు బోధిస్తుండగా 2023-24 బ్యాచ్‌లో నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. స్వర్ణాంధ్ర టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మిర్జా రియాజ్ హుస్సేన్, ఆలీ అబ్బాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదవ్యాస్ జన్మదిన వేడుకలు



బంటుమిల్లి: కేకు కోస్తున్న వ్యాస్ అభిమానులు, కూటమి నాయకులు


బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను, గూడూరు, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం బంటుమిల్లిలో ఆయన అభిమానులు, కూటమి శ్రేణులు వేడుకలు నిర్వహించాయి. పెడనలోని 14వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో అభిమానులు బాలలకు పెన్నులు, పుస్తకాలను అందజేశారు. ◆ కృత్తివెన్ను లక్ష్మీపురం రంగాబొమ్మ కూడలిలో కూటమి నాయకులు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. గూడూరు మండలం నారికేడలపాలెంలో వేదవ్యాస్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. జనసేన నాయకులు ఎం.కొండ, కె.వెంకన్న, పి.మోహన్‌త్రినాథ్, ఎస్.ఆంజనేయులు, ఎం.పూర్ణచంద్రరావు, కృత్తివెన్ను మండల జనసేన అధ్యక్షుడు టి.రామాంజనేయులు, వాసుదేవకృష్ణ, భీమరాజు తదితరులు పాల్గొన్నారు. ◆ పెడన మండలం చేవేంద్రలో తెదేపా, జనసేన నాయకులు ఎ.నాగేశ్వరరావు, యూ.వీరవెంకట్రావు, సోంబాబు, శివ తదితరులు కేకు కోసి పంపిణీ చేశారు.

కొనకళ్లకు మంత్రి అభినందనలు



నారాయణరావును సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావుకు ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అభినందనలు తెలిపారు. కొనకళ్ల నివాసానికి గురువారం వచ్చిన మంత్రి ఆయనను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేయడంతో పాటు సంస్థపై పరిపూర్ణ అవగాహన ఉన్న కొనకళ్లకు ఛైర్మన్ పదవి ఇవ్వడం హర్షణీయమన్నారు. బీసీ వర్గానికి చెందిన కొనకళ్లకు ఆర్టీసీ ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు బీసీ వర్గాల తరఫున చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని కొనకళ్ల లాభాల బాటలో నడిపిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణకు, త్యాగాలకు పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందనడానికి కొనకళ్లే నిదర్శనమన్నారు.



కొనకళ్ల సోదరులను గజమాలతో సత్కరిస్తున్న ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట): ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు అభినందనలు తెలిపారు. గురువారం ఆయా ప్రాంతాలకు చెందిన కూటమి, వివిధ సంఘాల నాయకులు మచిలీపట్నంలోని ఆయన ఇంటి వద్ద మర్యాపూర్వకంగా కలిసి సత్కరించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో సంయుక్త కార్యదర్శులు ఆర్.సుబ్బారావు, రాజేష్‌కుమార్, పీవీ మోహన్‌లతోపాటు ఎ.రామారావు, కల్యాణ్, వాసు తదితరులు పాల్గొని గజమాలతో సత్కరించారు. తెదేపా రాష్ట్ర నాయకులు, తెదేపా బందరు నియోజకవర్గ పరిశీలకులు లుక్కా సాయిరామ్‌గౌడ్‌తో పాటు వివిధ పక్షాల నాయకులు కొనకళ్ల నారాయణరావుతో పాటు ఆయన సోదరుడు జగన్నాథరావులను సత్కరించి అభినందనలు తెలిపారు. ◆ కృత్తివెన్ను మండల కూటమి నాయకులు ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ప్రాయశ్చిత్త దీక్ష



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కూటమి నాయకుల పూజలు

లక్ష్మీపురం (కృత్తివెన్ను): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా లక్ష్మీపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కూటమి నాయకులంతా ప్రాయశ్చిత్త దీక్ష చేశారు.

‘పేదలను వంచించిన పేర్ని మొసలికన్నీరు చాలించు’

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు పేద ప్రజలను వంచించిన పేర్ని వెంకట్రామయ్య(నాని), ఆయన కుమారుడు కిట్టూ ఇప్పుడు మొసలికన్నీరుతో ఆడుతున్న నాటకాలు చాలించాలని తెదేపా నాయకులు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పాషా, వెంకన్న తదితరులు మాట్లాడారు. ఎన్నికల ముందు కుమ్మరిగూడెంలోని 26 ఎకరాల పోరంబోకు మడుగు భూముల్లో చట్టవిరుద్ధమని తెలిసీ పేదలతో పేర్ని ఇళ్లు వేయించారన్నారు. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పేర్ని అరాచకాలు, అక్రమాలు భరించలేక ప్రజలు ఎన్నికల్లో రవీంద్రకు భారీ మెజార్టీతో అఖండ విజయం చేకూర్చారన్నారు. పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జులు అచ్చయ్యనాయుడు, కోస్తా మురళీకృష్ణ, గోకుల్ శివ, మాజీ కౌన్సిలర్ కాసాని భాగ్యారావు, తెదేపా కార్పొరేటర్‌లు సుధాకర్, దేవరపల్లి అనిత, సీనియర్ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబాప్రసాద్ తదితరులు

పేర్ని, కొడాలికి నిరసన సెగ

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లపై పేర్ని నాని, కొడాలి నాని చేసిన వ్యాఖ్యలకు కృత్తివెన్ను తెదేపా కార్యాలయం వద్ద కూటమి నాయకులు గురువారం సాయంత్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై వారు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. పేర్ని నాని డౌన్‌డౌన్... కొడాలి నాని డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. తెదేపా, జనసేన అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, నాగమల్లేశ్వరరావు, నాయకులు విజయ భాస్కరరావు, చంద్రమౌళి, చిన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కృత్తివెన్ను: నిరసన తెలుపుతున్న కూటమి నాయకులు

పవన్‌పై అవాకులు, చవాకులు మానుకోవాలి

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: వైకాపా నాయకుడు పేర్ని నాని పేర్ని రెడ్డిలా వ్యవహరిస్తున్నారని, పవన్‌కల్యాణ్‌పై అవాకులు, చవాకులు మానుకోవాలని జనసేన నాయకులు ధ్వజమెత్తారు. గురువారం విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ బుధవారం పేర్ని నాని వక్రంగా మాట్లాడిన మాటలపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకే తాము నాని ఇంటి వద్దకు వెళ్లామన్నారు. పవన్ తాగుబోతులను ఇంటిపైకి పంపారని నాని వ్యాఖ్యానించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొట్టె వెంకట్రావు, పినిశెట్టి వేణు, వంపుగడవల చౌదరి, కర్రి మహేష్, శాయన శివ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మరిన్ని సంక్షేమ పథకాలు

గోకవరం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని, భవిష్యత్తులో పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తుందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మండల పరిధిలోని గోకవరం, సిరివెళ్ళపాలెం గ్రామాల్లో గురువారం జరిగింది. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మండల తెదేపా అధ్యక్షుడు కుంచె నాని, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి లంకే శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



పెదతుమ్మిడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



37వ డివిజన్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానగరంలో: సుల్తానగరంలో రూ.60లక్షలతో సీసీ రోడ్లు, రూ.20లక్షలతో మంచినీటి పైప్ లైన్ మరమ్మత్తులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెదతుమ్మిడి(బంటుమిల్లి), న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల మనసులను గెలుచుకున్న మంచి ప్రభుత్వం మన ఎన్డీఏ కూటమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెదతుమ్మిడిలో గురువారం ఎన్డీఏ కూటమి 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ‘ఇది మన ప్రభుత్వం’ కార్యక్రమంలో కాగిత పాల్గొని మాట్లాడారు.

పెడన గ్రామీణం: నడుపూరులో కూటమి నాయకులు ఇంటింటికీ కరపత్రాల్ని పంచారు. తెదేపా నాయకులు వెంకటేశ్వరరావు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం(కృత్తివెన్ను): లక్ష్మీపురం గ్రామసచివాలయంలో గ్రామతెదేపా అధ్యక్షుడు పులగం నాగభూషణం(చిన్నబ్బులు) ఆధ్వర్యంలో కేకు కోసి, సంబరాలు చేసుకున్నారు.

మచిలీపట్నం (గొడుగుపేట): ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని వివిధ డివిజన్లలో ప్రజావేదిక సభలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్‌తో పాటు తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, అక్కుమహంతిరాజా, కార్పొరేటర్ ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించాలి.. సంపద సృష్టించాలి

న్యూస్‌టుడే, బంటుమిల్లి

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి వ్యర్థాల ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ కోసం పల్లెల్లో సంపద కేంద్రాలను నిర్మించారు. అవి ప్రారంభంలో పని చేసి కొన్ని నెలలకే చాలా చోట్ల మూలకు చేరాయి. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలలో చాలా చోట్ల అవి అలంకారప్రాయంగా దర్శనమిచ్చాయి. తిరిగి వాటిని పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకురావడంలో చాలా పంచాయతీలు వైఫల్యం చెందాయి. మల్లపరాజుగూడెం, అర్తమూరు, పెదతుమ్మిడి, పలు గ్రామాలలో ఇదే కోవకు చెందుతాయి.



మల్లేశ్వరంలో పాత సినిమా హాలు వద్ద..



బంటుమిల్లిలో సచివాలయ సిబ్బంది, ప్రజల ప్రతిజ్ఞ

కుప్పలు..తెప్పలుగా..

చాలా చోట్ల పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలు సేకరించకపోవడంతో చేసేదేమీ లేక ప్రజలు చెత్తను వీధుల్లో ఓ చోట వేస్తున్నారు. ఆ చెత్తను సకాలంలో ఏ రోజుకారోజు తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అవుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలలో వ్యర్థాలు కుప్పలుగా పెరుకుపోయి పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. గాలికి అక్కడి చెత్త ఎగిరి ఇళ్లు, వీధుల వెంబడి చేరుతోంది. మండల స్థాయి అధికారులు ఉండే ప్రభుత్వ కార్యాలయాల ప్రాంతాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించవచ్చు. అధికారులు స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల నుంచి సంపద సృష్టించాలని కోరుతున్నారు.

ఎన్‌సీసీకి 38 మంది విద్యార్థుల ఎంపిక

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీలో చేరే విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 16వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సన్నాన్‌సింగ్ పర్యవేక్షణలో ఎత్తు, దేహదారుఢ్యం తదితర పరీక్షలు నిర్వహించి 38 మందిని ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ అధికారి డి.రామశేఖరరెడ్డి తెలిపారు.

పూర్తయిన కల్వర్టు నిర్మాణం

తాళ్లపాలెం (మచిలీపట్నంరూరల్): తాళ్లపాలెం శివారు పల్లెతాళ్లపాలెంలో పంట కాలువపై కల్వర్టు నిర్మాణం గురువారం పూర్తయింది. దీంతో భారీ వాహనాలు గ్రామంలోకి రాకపోకలు సాగిస్తున్నాయి. కల్వర్టు కూలిన నాలుగు రోజుల్లోనే తాత్కాలిక కల్వర్టును మంత్రి రవీంద్ర నిర్మింపచేయడం సంతోషంగా ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఏఈ జవహర్ త్వరితగతిన కల్వర్టును నిర్మాణం చేయించారు. గ్రామ తెదేపా నాయకులు కొనకళ్ల నాగరాజు, కొక్కిలిగడ్డ జయకృష్ణ కల్వర్టు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. మచిలీపట్నం వెళ్లే విద్యార్థుల కష్టాలు తొలగాయని గ్రామస్థులు చెబుతున్నారు.

ఆర్.గొల్లపాలెంలో సామూహిక సీమంతాలు



రుద్రవరం (మచిలీపట్నంరూరల్): పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా గురువారం రుద్రవరం శివారు ఆర్.గొల్లపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీమంతాలతో పాటు అన్నప్రాసన వేడుకలు, వెల్‌బేబీషో నిర్వహించారు. గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారం, పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఐసీడీఎస్ సీడీపీవో గ్లోరి, చిన్నాపురం సెక్టార్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, మాలతి, వెంకటేశ్వరమ్మ వివరించారు.

నీళ్లు పట్టుకోకుండా వెళ్లిపోతే ఎలా?



ట్యాంకరు ఎదుట బైఠాయించిన మహిళ

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నీళ్లు పట్టుకోకుండా ట్యాంకరు వెళ్లిపోతే ఎలా అంటూ రాజుపేటకు చెందిన ఓ మహిళ గురువారం ట్రాక్టర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. మూడిళ్లకు కలిపి ఒక చోట ట్యాంకర్ ఆపడంతోపాటు మనిషికి నాలుగు బిందెలే పట్టుకోవాలని అంటున్నారని, ఇలా అయితే నీళ్లు ఎలా సరిపోతాయని ఆమె ప్రశ్నించారు. రెండిళ్లకు ఒకచోట ట్యాంకర్ ఆపేలా చూడాలని కోరారు. స్థానికులు సర్దిచెప్పడంతో ఆమె నిరసన విరమించారు.

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రామవరప్పాడు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం విజయవాడ రూరల్ మండలంలోని పాతపాడు, నైనవరం, అంబాపురం గ్రామాల్లో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఉయ్యూరు గ్రామీణం: గత ప్రభుత్వంలో జరిగిన దోపిడిలు, అక్రమాల వల్ల రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నా కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన చేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. చిన ఓగిరాలలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం స్టిక్కర్లను ఆవిష్కరించారు.

కానూరు: కానూరులో జరిగిన కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్


కానూరులో కరపత్రాలు పంచుతున్న శంకరబాబు తదితరులు

డ్వాక్రా ఉత్పత్తుల్ని ప్రోత్సహించాలి


మహిళకు బ్యాగు అందిస్తున్న నగర పంచాయతీ కమిషనరు వెంకటేశ్వరరావు

ఉయ్యూరు, న్యూస్‌టుడే : డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తుల్ని ప్రజలు ఆదరించి ప్రోత్సహించాలని ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనరు పి. వెంకటేశ్వరరావు అన్నారు. ఉయ్యూరు బస్టాండ్ సమీపంలో పట్టణ మహిళా సమాఖ్య ఉయ్యూరు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటైన 'మెప్మా అర్బన్ మార్కెట్'ను ఆయన గురువారం పరిశీలించారు. మహిళలు తయారు చేసిన బ్యాగులు, బొమ్మలు ఇతరేతర వస్తువుల ప్రదర్శనను చూశారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈవో- 2 బి.సురేష్‌కుమార్ సూచించారు. ఇందులో భాగంగా ఇస్రో, విభా సంస్థతో కలిసి స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం చేపట్టింది. ప్రత్యేక బస్సులో దీనికి సంబంధించిన నమూనాలను ఏర్పాటు చేసి, విద్యార్థులు తిలకించే అవకాశం కల్పిస్తున్నారు. ఈ బస్సు గురువారం ఆరుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చింది.


విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు

హెచ్ఎం దుర్గాప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు దీని గురించి విద్యార్థులకు వివరించారు.

నష్టపరిహారం చెల్లింపు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందజేస్తున్నట్లు తహసీల్దారు భావన్నారాయణ, ఏవో పి.ఎం.కిరణ్ తెలిపారు. మండలంలో వరద ప్రభావిత గ్రామాల్లోని 1658 మందికి రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పారు. అదే విధంగా 4180 ఎకరాలు ముంపునకు గురవగా 1780 మంది రైతులు పంట నష్టపోయారని, వారికి ఎకరానికి రూ. 10 వేలు చొప్పున బ్యాంకు ఖాతాలకు జమవుతున్నాయన్నారు.

దారంతా గుంతలు.. ప్రయాణికులకు వెతలు

నిడమానూరు, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు రైల్వేట్రాక్ మీదుగా నిడమానూరులోకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. జాతీయ రహదారి నుంచి రైల్వేట్రాక్ వరకు ఉన్న రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. నిడమానూరుతో పాటు పోరంకి, తాడిగడప, పెనమలూరు నుంచి గన్నవరం వైపు వెళ్లే వాహనదారులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం పడిన సమయంలో గుంతలు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం నీరు వారం రోజులు పాటు గోతుల్లోనే నిలుస్తున్నాయి. కొన్ని చోట్ల అయితే రెండు అడుగుల మేర గుంతలు పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


నిడమానూరు రోడ్డులోని గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

పరిశుభ్రతకు పెద్దపీట

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాభారతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్, ఓగిరాల, కానుమోలులోని పలు ప్రాంతాలను పరిశుభ్రం, ప్లాస్టిక్ నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నృత్య రూపకంతో వివరించారు.

కంకిపాడు గ్రామీణం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే దిశగా ప్రజలను చైతన్యవంతం చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కళా భారతి కల్చరల్ వారి కళాజాత కార్యక్రమం ఆకట్టుకుంది. గురువారం మండలంలోని ప్రొద్దుటూరు, గొడవర్రు, మద్దూరులో కళాజాత నిర్వహించారు.

గ్రామ సభలది కీలకపాత్ర

రామవరప్పాడు, న్యూస్‌టుడే : గ్రామానికి అవసరమైన పనులు గుర్తించడం, సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి గ్రామ సభలు కీలకపాత్ర పోషిస్తాయని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి గంటా రామ్మోహనరావు అన్నారు. గురువారం రామవరప్పాడులో గ్రామ సభ నిర్వహించి విజన్-2047 రూపకల్పనపై పలు అంశాలతో పాటు గ్రామ సమస్యలపై చర్చించారు. సర్పంచి వరి శ్రీదేవి, ఉప సర్పంచి పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధార్మిక ఆస్తుల్ని కాపాడాలి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో హైందవ తరహా చట్టాన్ని తీసుకొచ్చి హిందూ ధార్మిక ఆస్తుల్ని కాపాడాలని, దేవాలయాల్లో రాజకీయ ప్రమేయాన్ని, ట్రేడ్ యూనియన్లను నిషేధించాలని రామ సేవక్ సంఘ్, హిందూ ధార్మిక వాహిని జిల్లా కన్వీనర్ డాక్టర్ దివి చిన్నయ డిమాండ్ చేశారు. ఉయ్యూరులో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా జాతీయ స్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

ఐవిహెచ్ వ్యాధిపై అప్రమత్తత అవసరం

కానూరు, న్యూస్‌టుడే : ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్(ఐవిహెచ్) వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ న్యూరో ఆప్తమాలజిస్టు వీరేందర్ సచ్‌దేవ్ అన్నారు. గురువారం ఆస్పత్రిలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. గర్భధారణ ఉన్న స్త్రీలలో, ఊబకాయం, కంటి సమస్య ఉన్నవారిలో ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. [illegible] తీవ్ర తలనొప్పి, [illegible] లక్షణాలని [illegible] ఈ వ్యాధిని నయం చేసుకోవచ్చని చెప్పారు.


బుడమేరు బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న వాహనాలు


ధ్వంసమైన రెయిలింగ్

హైలెవెల్ వంతెన నిర్మాణం ఎప్పుడో..?

వరదకు దెబ్బతిన్న రెయిలింగ్‌లు, పిల్లర్లు

కంకిపాడు, న్యూస్‌టుడే

కంకిపాడు- గన్నవరం రహదారిపై ఉప్పలూరు- కేసరపల్లి మధ్య బుడమేరుపై శతాబ్దం కిందట నిర్మించిన లో-లెవెల్ వంతెన ఇటీవల వచ్చిన వరదలకు మరింత దెబ్బతింది. దీనిపై నిత్యం సుమారు అయిదు వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్టీసీ సర్వీసులు ప్రతి 15 నిమిషాలకొకటి చొప్పున, గన్నవరం నుంచి ఎర్రమట్టి, రబ్బీష్ టిప్పర్లు, ఇతర భారీ వాహనాలు వెళ్తుంటాయి. రాష్ట్రంలోనే త్వరితగతిన విస్తరిస్తున్న గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలకు ఈ వంతెన అనుసంధానంగా ఉంది. ఇంత ప్రాధాన్యం కలిగి అవసాన దశకు చేరుకున్నా ప్రత్యామ్నాయ వంతెన నిర్మాణంపై పాలకులు, అధికారులు దృష్టి సారించలేదని విమర్శలు వస్తున్నాయి.

నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు

పదేళ్ల కిందట రైవస్ కాల్వపై ఉప్పలూరు వంతెనకు, దీనికి కలిపి ఒకే ప్యాకేజీ కింద రూ.10 కోట్లు మంజూరైనట్లు అప్పటి రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీరు ప్రకటించడాన్ని ఆయా గ్రామస్థులు ప్రస్తావిస్తున్నారు. అయితే బుడమేరుపై కొత్త పైవంతెన నిర్మాణాన్ని డ్రెయినేజీ విభాగం 'డెల్టా ఆధునీకికరణ' పనుల్లోనూ చేర్చారు. రెండు శాఖలు, అప్పటి ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపంతో పనులు చేపట్టక పోవడంతో నిధులు మురిగిపోయాయి.

అత్యంత ప్రమాదకరం

బుడమేరు వరద ముందుకు వెళ్లేలా నేల మట్టానికి దీన్ని నిర్మించారు. ప్రవాహం అధికంగా ఉంటే వంతెనపై నాలుగైదు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ఇటీవల వచ్చిన వరదలో దాదాపు 10 అడుగుల నీరు వారం పాటు నిల్వ ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలిగిన విషయం విదితమే. దీంతో నీటి వేగానికి పై భాగం, పిల్లర్లు బీటలు వారాయి. వంద అడుగుల రోడ్డుగా ప్రతిపాదించగా ఈ వంతెన వెడల్పు 12 అడుగులే ఉండడంతో పెద్ద వాహనం ఒక్కటి మాత్రమే వెళ్తోంది. గత ఐదేళ్లలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో పది మంది మృతి చెందగా క్షతగాత్రుల సంఖ్య వంద వరకు ఉంటుంది. అందుకే దీన్ని ప్రమాదకర వంతెనగా ప్రకటించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో జల వనరులు, రోడ్లు భవనాల శాఖ, పెనమలూరు, గన్నవరం ఎమ్మెల్యేలు సమన్వయంతో కొత్త పైవంతెనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రత మన బాధ్యత

కంకిపాడు, కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే అక్కడి ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచి ఇందిర తదితరులు అన్నారు. గురువారం ఈడుపుగల్లులో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధికారులతో కలిసి ప్రదర్శన చేపట్టారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న రాజా, సర్పంచి ఇందిర తదితరులు

సామూహిక సీమంతాలు



పోషక మాసోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం బాపులపాడు రైల్వేస్టేషన్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. గన్నవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సర్పంచి కమలాబాయి, సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి పర్యవేక్షణలో ఉత్సాహంగా ఈ సంబరాలు చేశారు. **-న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్**

మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహణ

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ బాట్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామని ఎంఈవో ప్రసాద్, ప్రధానోపాధ్యాయిని సుధారాణి, పీఈటీలు ఎం.హరగోపాల్, దుర్గాప్రసాద్ తెలిపారు. పోటీల్లో బాలికలు 14, బాలురు 16 జట్లు పోటీపడినట్లు చెప్పారు.


పోటీలు ప్రారంభిస్తున్న అజ్గర్ తదితరులు


నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెనమలూరు, న్యూస్‌టుడే : పెనమలూరు మండల స్థాయి ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక వణుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగింది. అండర్ -17 విభాగంలో ఖోఖో, షటిల్, వాలీబాల్, చెస్ తదితర క్రీడలకు గానూ బాలురు, బాలికలను ఎంపిక చేశారు. వ్యాయామోపాధ్యాయుడు కె.సురేష్‌కుమార్, హెచ్ఎం రఘురామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వణుకూరులో..

ఉయ్యూరు, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడాలని ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఆరేపల్లి శివసాయిప్రసాద్ అన్నారు. పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. మండల స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జి.వి.రమణ, హెచ్ఎం స్వప్నదేవి తదితరులు పాల్గొన్నారు.

కొనకళ్లకు అభినందన

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును రాష్ట్ర నీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ గురువారం కలిసి అభినందనలు తెలిపారు. మంగళగిరి తెదేపా కేంద్ర కార్యాలయంలో గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా సమక్షంలో కొనకళ్లను కలిసి పూలమొక్క అందించారు.


నారాయణరావుకు మొక్క అందిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

హద్దు మీరితే కఠిన చర్యలు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : ఆటో డ్రైవర్లు ఎలాంటి గొడవలు చేయకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకుండా నడుచుకోవాలని లేనిపక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జనార్దన్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో హనుమాన్ జంక్షన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో ఆటోలను నిలిపే విషయంపై తరచుగా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని యూనియన్లను గురువారం పోలీస్‌స్టేషన్‌లో సమావేశపర్చిన ఎస్సై వారికి పలు సూచనలు చేశారు.

బంగారం ఇవ్వడం లేదంటూ ఫిర్యాదు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : తన భార్య మరణించిన సమయంలో జరిగిన ఒప్పందం మేరకు ఇవ్వాల్సిన బంగారం అప్పగించడం లేదంటూ ఓ వ్యక్తి హనుమాన్ జంక్షన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై జనార్దన్ వివరాల ప్రకారం.. జి.కొండూరు మండలం చిన నందిగామకు చెందిన కొన్నగంటి గోపి చౌదరి, భార్య రూప కేడీసీసీ బ్యాంకులో పని చేస్తుంటారు. ఈ క్రమంలో 2021లో కుమారుడ్ని ప్రసవించిన కొన్ని రోజులకే ఆమె అనారోగ్యంతో మృతి చెందారు. ఆ సమయంలో ఉద్యోగ ప్రయోజనాల రీత్యా రూ.27 లక్షలు నగదు వచ్చింది. ఈ మొత్తాన్ని కుమారుడు మేజర్ అయిన తర్వాత అతడి పేరిట బ్యాంకులో వేయాలని, అప్పటి వరకు బంగారం తమ వద్దే ఉంటుందంటూ బంధువులు అప్పట్లో రూ.లక్షలు విలువ చేసే బంగారం తీసుకెళ్లారని, అనుకున్న విధంగానే రూ.27 లక్షలు, వడ్డీతో కలిపి రూ.35 లక్షలు గోపి చౌదరి కుమారుడు పేరిట ఎఫ్‌డీ వేశానని, ఈ నేపథ్యంలో బంగారం ఇమ్మని బంధువుల్ని అడగ్గా, వారు ఆ విషయం తమకు తెలియదని, ఎలాంటి బంగారం తమ వద్ద లేదంటూ చెప్పారంటూ గోపి చౌదరి నూజివీడు కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఉంగరాల చోరీపై కేసు

పెనమలూరు : ఇంట్లో దాచిన ఉంగరాల చోరీపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పీవై ప్రసాద్ అనే వ్యక్తి కానూరు వల్లభహోమ్స్‌లో నివశిస్తుంటారు. ఈ నెల 7న ఇతను బయటకు వెళ్తూ తన రెండు బంగారు ఉంగరాలను బీరువాలో పెట్టి వెళ్లాడు. తర్వాత రోజు ఉదయం చూడగా అవి కనిపించలేదు. వాటి కోసం వెతికిన ఆచూకీ తెలీకపోవడంతో గురువారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : ఎన్‌సీసీతో యువతలో నిబద్ధతతో కూడిన క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతోందని, అలాగే సేవాభావం, ధైర్యం ఏర్పడుతాయని 17వ ఆంధ్రా బెటాలియన్ సీవో లెఫ్టినెంట్ కల్నల్ జి.సి.పాండే అన్నారు. స్థానిక ఏజీఎస్‌జీఎస్ కళాశాలలో గురువారం జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపికను ఆయన పరిశీలించారు. మొత్తం 22 మంది విద్యార్థినులను, 36 మంది విద్యార్థుల్ని ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ శివనాథ్, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎన్‌సీసీ విభాగం కేర్ టేకర్ ఎం.డి.నూర్ పాల్గొన్నారు.


క్యాడెట్ల ఎంపికను పర్యవేక్షిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ జి.సి.పాండే

వరద బాధితులకు సాయం

కానూరు, న్యూస్‌టుడే : కానూరుకు చెందిన జి.చంద్రావతి వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబుకు లక్ష రూపాయల చెక్కును అందించారు. ఆమెకు వచ్చే పింఛనులో ఈ మొత్తాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. యార్లగడ్డ వెంకట రామకృష్ణ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబుతో చంద్రావతి

గన్నవరం గ్రామీణం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి గన్నవరం స్రవంతి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు ప్రిన్సిపల్ కొమ్మినేని రామకృష్ణ తన వంతుగా కలిపి రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును గురువారం కలిసి సదరు చెక్కును అందించారు.


ఎమ్మెల్యే వెంకట్రావుకు చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపల్ కొమ్మినేని రామకృష్ణ, ఉపాధ్యాయులు

గృహ నిర్మాణాలపై సమీక్ష

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో గృహ నిర్మాణాలపై ఆ శాఖ సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మాణంలో ఉన్న ఇళ్లను 2025 మార్చిలోగా పూర్తి చేయాలని.. అందుకు సంబంధించిన పూర్తి విధి విధానాలపై అవగాహన కల్పించారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679



? పామర్రు మండలం జమిగోల్వేపల్లి నుంచి అడ్డాడ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు, జమిగోల్వేపల్లి నుంచి పెదమద్దాలి మీదుగా పామర్రు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. - **వెంకటరత్నం, జమిగోల్వేపల్లి**

✔జమిగోల్వేపల్లి నుంచి అడ్డాడ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అత్యవసర మరమ్మతులకు రూ.40లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తికాగానే పనులు చేపడతాం. జమిగోల్వేపల్లి నుంచి పామర్రు వెళ్లే రోడ్డుని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - **జె.కమేశ్వరరావు, డీఈ ఆర్అండ్‌బీ**

? జమిగోల్వేపల్లి ఎస్సీ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - కె.ఏసుదాసు, జమిగోల్వేపల్లి

✔తగు చర్యలు తీసుకుంటాం. - **ఆర్.సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి**

? నల్లపల్లి రోడ్డులో చెత్త పేరుకుపోయింది. - **ఎన్.కుమార్, పామర్రు**

✔చెత్త తొలగించి సంపద కేంద్రానికి తరలిస్తాం. - **సలీమ్, పంచాయతీ కార్యదర్శి,**

- న్యూస్‌టుడే, పామర్రు, పామర్రు గ్రామీణం

సమష్టిగా వరద విపత్తును ఎదుర్కొన్నాం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అధికార యంత్రాంగానికి ప్రజలు సహకరించడంతో సమష్టిగా వరద ముప్పును ఎదుర్కొన్నామని ఎంపీడీవో ఎం.జమలయ్యదేవి అన్నారు. పులిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచి దాసరి విజయకుమార్ అధ్యక్షతన గురువారం జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో మరియదేవి పాల్గొన్నారు. ప్రత్యేకాధికారి, ఉద్యాన శాఖ అధికారి ఎన్.రమేష్ మాట్లాడుతూ మెట్ట భూమి సాగు రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం బ్యాంకు ఖాతాలకు జమ చేసిందన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు, హరిత రాయబారులకు కొబ్బరినూనె, బూట్లు, ప్రథమ చికిత్స కిట్లను అందజేశారు.



బాలాజీతో ఎమ్మెల్యే కుమార్‌రాజా, తెదేపా నాయకులు

కలెక్టర్ దృష్టికి పామర్రు సమస్యలు

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పార్టీ నాయకులతో కలిసి గురువారం కలెక్టర్ బాలాజీని కలిసి విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. తెదేపా మండల అధ్యక్షుడు కుదురవల్లి ప్రవీణ్‌చంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, వల్లూరుపల్లి గణేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలోనే పేదల కాలనీలు

స్థలాలిచ్చి వసతులు మరిచారు ★ ఇళ్ల నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారులు



ఐటీవల వర్షాలకు మోకాళ్లలోతు నీటిలో జగనన్న కాలనీ

న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం, గుడివాడ గ్రామీణం, అవనిగడ్డ

ముంపు భయం.. మౌలిక సదుపాయాల లేమితో పేదల కాలనీల లబ్ధిదారులు సతమతమవుతున్నారు. స్థలాలిచ్చిన వసతులు సమకూర్చకపోవడంతో కాలనీల్లో నివాసం ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడంలేదు. గత వైకాపా ప్రభుత్వంలో పామర్రు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లోని 106 పంచాయతీల పరిధిలో 155 లేఅవుట్లు వేసి 12,165 మందికి స్థలాలిచ్చారు. వాటిలో 7,253 మంది లబ్ధిదారులకు గృహాలు నిర్మించుకునేందుకు అనుమతులు రాగా, ఇప్పటి వరకు 1,278 మాత్రమే పూర్తయ్యాయి. పామర్రు మండలం కనుమూరులో 120 మందికి పట్టాలిచ్చారు. 20 మంది పనులు ప్రారంభించగా 10 మాత్రమే పూర్తయ్యాయి. స్థలాలు మెరక చేయకపోవడం, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మించకపోవడం, విద్యుత్తు, తాగునీటి వసతి లేక నివాసం ఉండేందుకు లబ్ధిదారులు ఇష్టపడలేదు. నాలుగు కుటుంబాలు మాత్రమే ఇళ్లలో ఉంటూ నిత్యం కష్టాలు అనుభవిస్తున్నారు.



ఎర్లంక రహదారిలోని గృహాలు చూసుకోవడానికి వెళ్తున్న లబ్ధిదారులు

✪ అవనిగడ్డ ఎర్లంక రహదారిలో 800 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసిన లేఅవుట్ వరద నీటిలో మునిగింది. అవనిగడ్డ నియోజకవర్గంలోని పెద్ద లేఅవుట్ దుస్థితి చూస్తూ లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పది మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఇటీవలి భారీ వర్షాలకు వరద రావడంతో వారంతా గృహాలు ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. వరద తగ్గిన అనంతరం గృహాలు ఎలా ఉన్నాయో చూసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. లబ్ధిదారులు మోకాలి లోతు నీటిలో కాలనీలోకి బయలుదేరి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. పక్కనే ఉన్న మామిడి తోటలో ఎండ పడక ఇప్పటికే మోకాలిలోతున్నర నీరు నిల్వ ఉండడంతో దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉందని, ఈ పరిస్థితుల్లో ఎలా ఉండాలని ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఒత్తిడితో అప్పులు చేసి రూ.10 లక్షలతో నిర్మించిన గృహాలు నివాస యోగ్యంగా లేకుండాపోయాయి.

★ వరద ముంపు ప్రాంతంలో ఉన్న ఎడ్లంక, దక్షిణ చిరువోలులంక, పులిగడ్డ పల్లిపాలెం, రేగుల్లంక, వసుమట్ల వంటి గ్రామాల కాలనీలది కూడా ఇదే పరిస్థితి. వారిని కూడా ముంపు ప్రాంతాల నుంచి బయటకు తీసుకురావాల్సిందే. అక్కడి నుంచి బయటకు రాలేక, కట్టుకున్న గృహాల్లో ఉండలేక, లబ్ధిదారులు ఒకరికొకరు సంబంధం లేకుండా జీవిస్తూ అవస్థలు పడుతున్నారు.



ఇళ్లకి వెళ్లే దారిలేకుండా నిలిచిన నీరు

గుడివాడ మండలం మల్లాయపాలెం కాలనీలో లబ్ధిదారులు రూ. లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నారు. చిరు జల్లు కురిసినా నీరు బయటకు పోయే మార్గంలేక కాలనీవాసులు పడరాని పాట్లు పడుతున్నారు. మురుగు, వాన నీరు రహదారులపై చేరి ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. తప్పని సరి పరిస్థితిలో వచ్చినా మోకాలి లోతు నీటిలో నడిచి ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. అంతర్గత రోడ్లు లేక చాలా మంది బురదలో ఇళ్ల నిర్మాణం చేయలేక అవస్థలు పడుతున్నారు. మొత్తం 7007 ప్లాట్లలో 4039 మందికి గృహనిర్మాణ రుణాలు అందించారు. వారిలో 937 మంది మాత్రమే పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సూపర్-6 పథకాలతో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



ప్రజల సమస్యలు వింటున్న మాజీ ఎమ్మెల్యే రావి తదితరులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: సూపర్-6 పథకాలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక అంజుమన్ భవన్‌లో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని గెలుచుకుందన్నారు. దీపావళికి దీపం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ పథకం కూడా ప్రారంభిస్తారన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడివాడలో అభివృద్ధి ఏదైనా జరిగిందంటే అది తెదేపా ప్రభుత్వ హయాంలోనే అన్నారు. అంజుమన్ భవన్ కూడా తెదేపా ప్రభుత్వం నిర్మించిందన్నారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన నేత బూరగడ్డ శ్రీకాంత్, సీనియర్ తెదేపా నాయకుడు డాక్టర్ గొర్ల సత్యనారాయణతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

☛ కార్మికనగర్ 26వ వార్డు ఇన్‌ఛార్జి పైడిముక్కల వంశీ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బొమ్ములూరులో మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ (చంటి), నవీన్ ర్యాలీ నిర్వహించారు.

హామీలన్నీ నెరవేరుస్తాం..

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం కౌతవరం పార్కులో ప్రజావేదికగా నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో చర్చించారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, రాష్ట్రకార్యదర్శి శాయన పుష్పావతి, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి దావులూరి సురేంద్రబాబు, జనసేన మండల అధ్యక్షులు తోట చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

పాతఎడ్లంక (అవనిగడ్డ గ్రామీణం), పెదపారుపూడి, న్యూస్‌టుడే: పాతఎడ్లంక వరద బాధితులకు ఉయ్యూరుకు చెందిన రెహబోత్ మినిస్ట్రీస్ 400 కుటుంబాలకు రూ.2.5 లక్షల విలువ చేసే నిత్యావసర సరకులు, వంటపాత్రలు గురువారం అందజేశారు. వాటిని బాధితులకు పాస్టర్లు కాంతారావు, ఎం.రత్నరాజు, కరుణాకర శాస్త్రి పంపిణీ చేశారు. సర్పంచి పాలెపు సామ్రాజ్యం, ఎంపీటీసీ సభ్యురాలు జెరూసా రాణి తదితరులు పాల్గొన్నారు.

☛ తమిళనాడు రాష్ట్రంలోని తిరుప్పూర్‌కు చెందిన ఐసీ ఈఏ కంపెనీ రూ.4.5లక్షలతో దుప్పట్లు, దోమతెరలు అవనిగడ్డ మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన 1500 కుటుంబాలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మండలి వెంకట్రామ్ ఎంపీపీ తుంగల సుమతి, సర్పంచి పాలెపు సామ్రాజ్యంతో కలిసి ప్రారంభించారు.

☛ పెదపారుపూడి మండలంలోని మోపర్రులో బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వంటపాత్రల కిట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ టి.ఎస్.బాలాజీ పాల్గొన్నారు.



సరకులు పంపిణీ చేస్తున్న పాస్టర్ కాంతారావు తదితరులు



దుప్పట్ల పంపిణీలో మండలి వెంకట్రామ్ తదితరులు

పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు పూర్తిచేయాలి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో 2025 నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలని గృహనిర్మాణశాఖ డీఈ ఎం.రామ్‌జీనాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మా ఇల్లు మన గౌరవం కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఏవై కింద 1.0 కింద మంజూరైన గృహాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

మండలి వెంకటకృష్ణారావు వర్ధంతి నేడు



అవనిగడ్డ, మోపిదేవి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు వర్ధంతి ఈనెల 27వ తేది ఉదయం 9 గంటలకు స్థానిక గాంధీ క్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొంటారన్నారు.

మోపిదేవిలో రక్తదానం శిబిరం

మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు వర్ధంతి సందర్భంగా మోపిదేవి కెనరా బ్యాంకు సమీపంలో ఉన్న రావి బాబూరావు ఖాళీ స్థలంలో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ మోపిదేవి యూనిట్ బాధ్యులు తహసీల్దార్ శ్రీవిద్య, యర్రంశెట్టి సుబ్బారావులు గురువారం తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



జగదీష్

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థి అదృశ్యమైన సంఘటనపై గురువారం కేసు నమోదు చేశామని గుడివాడ తాలూకా పోలీసులు తెలిపారు. వలివర్తిపాడు గ్రామ పరిధిలోని న్యూవిజన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అనంతపురానికి చెందిన టి.కృష్ణ మోహన్ కుమారుడు జగదీష్ 10వ తరగతి చదువుతున్నాడు. ఇక్కడ ఉండటానికి కొంత కాలం నుంచి జగదీష్ తెలుగా తల్లిదండ్రులు బుజ్జగించి దూరాకు తీసుకెళ్లామని చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో జగదీష్ ఈ నెల 24న పాఠశాల నుంచి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులకు చెప్పారన్నారు, అతని ఆచూకీ లభించకపోవడంతో పాఠశాల ప్రిన్సిపల్ నౌబూరి గంగా మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రజక ఐలమ్మ జయంతి

అంగలూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: అంగలూరులో గురువారం రజక సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతిని పంచాయతీ సెంటర్‌లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కోశారు. మంతెనా వెంకటేశ్వరరావు, మహేశ్, వెంకన్న తదితరులు ఎల్లొన్నారు.

కిడ్నీ బాధితుడికి సాయం


చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లికి చెందిన అబ్దుల్ సుభాన్ కిడ్నీ సమస్యలతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో దస్తావేజులేఖరులు, వీఆర్వోలు రూ.16,700ను సుభాన్‌కు గురువారం అందజేశారు. డాక్యుమెంటరీ రైటర్లు కస్తూరి వరప్రసాద్, దావులూరి మధుసూదనరావు, వడ్లమూడి రాజశేఖర్, తోట నాగేశ్వరరావు, రాజశేఖర్, బత్తుల సాయి, ఆకుల లక్ష్మీనారాయణ, తాళ్లూరి హరి, సుబ్రహ్మణ్యం, గుడిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోడి పుంజులు పోయాయని ఫిర్యాదు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని భద్రిరాజుపాలెంలో పెంచుకుంటున్న రూ.35 వేలు విలువ గల మూడు కోడిపుంజులు చోరీ జరిగినట్లు ఆకివీడు కొండలు పోలీస్‌స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశాడని ఎస్సై అర్జునరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అన్నదాతకు కొండంత అండ

15 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నష్ట పరిహారం జమ



లంకలో దెబ్బతిన్న లిల్లీ పూల తోట

న్యూస్‌టుడే, తోట్లవల్లూరు, అవనిగడ్డ గ్రామీణం, మోపిదేవి

వరదలు ముంచెత్తడంతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతను ప్రభుత్వం 15 రోజుల్లోనే ఆపన్నహస్తం అందించింది. అరుగాలం శ్రమించి పండించిన పంట వరదార్పణమైంది. వెంటనే స్పందించిన ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి బుధవారం రాత్రి నుంచే ఖాతాల్లో పరిహారం జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత అయిదేళ్లలో ఏటా ప్రకృతి వైపరీత్యాలతో భారీగా పంట నష్టం చవిచూసినా వైకాపా ప్రభుత్వం ఆదుకోలేదని, కనీసం పెట్టుబడి రాయితీ కూడా సకాలంలో ఇవ్వలేదని అన్నదాతలు గుర్తు చేస్తున్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సకాలంలో తమను ఆదుకోవడం గొప్ప విషయమని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తోట్లవల్లూరు మండలంలో వరి, చెరకు పంటలు 282.76 హెక్టార్లలో 764 మంది రైతులు నష్టపోగా ప్రభుత్వం వారి ఖాతాల్లో రూ.67,13,800 జమ చేసింది. తోట్లవల్లూరు మండలంలో ఉద్యాన పంటలు 2033.286 హెక్టార్లలో 5235 మంది రైతులు నష్టపోగా రూ.07.16 కోట్లు జమ చేసిందని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఉద్యానశాఖాధికారి జోసఫ్‌చందు గురువారం తెలిపారు.

గ్రామం	దెబ్బతిన్న పంట హెక్టార్లలో..	రైతులు	పరిహారం మొత్తం (రూ.లలో..)
ఐలూరు	136.2	468	46,90,470
గుర్విందపల్లి	0.1	1	7,000
మధురాపురం	1.317	10	38,470
ములకలపల్లి	18.931	36	6,54,485
చినపులిపాక	0.47	1	11,750
చాగంటిపాడు	311.385	791	1,08,21,445
దేవరపల్లి	298.769	714	1,01,96,960
నార్సువల్లూరు	507.97	1153	1,77,10,070
రొయ్యూరు	265.074	621	98,52,890
తోట్లవల్లూరు	493.17	1441	1,76,40,150

దెబ్బతిన్న గృహాలకు రూ.1.18 కోట్లు

కృష్ణా నదికి ఇటీవలి వచ్చిన వరదలకు లంక గ్రామాలు నీట మునిగాయి. దీనిపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో కష్టపడి దెబ్బతిన్న గృహాల జాబితా తయారు చేశారు. లంకల్లో 1181 గృహాలు దెబ్బతినగా వాటికి ప్రభుత్వం రూ.1.18 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. 15 రోజుల్లో నష్టపరిహారం అందించడంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలవారీగా ఇలా..

గ్రామం	దెబ్బతిన్న గృహాలు	పరిహారం మొత్తం (రూ.ల్లో..)
తోడేళ్లదిబ్బలంక	158	15,80,000
కొటింగదిబ్బలంక	79	7,90,000
పాములలంక	519	51,90,000
పిల్లివానిలంక	72	7,20,000
పొట్టిదిబ్బలంక	208	20,80,000
ములకలపల్లిలంక	62	6,20,000
కనిగిరిలంక	183	18,30,000

☛ అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ, పాతఎడ్లంక, దక్షిణచిరువోలులంక, బాలిపర్రు గ్రామాల్లోని 655 మంది రైతులకు పంట నష్టపరిహారం కింద రూ.46లక్షలు మంజూరు కాగా మోపిదేవి మండలంలోని నది పరీవాహక ప్రాంతాలకు చెందిన 1481 మంది రైతులకు పంట నష్టపరిహారం రూ.1.10 కోట్లు విడుదలైనట్లు ఉద్యాన శాఖ అధికారి ఎన్.రమేష్ తెలిపారు.

☛ వాణిజ్య పంటలైన అరటి, పసుపు పంటలకు హెక్టారుకు రూ.35వేలు కాగా ఉద్యాన పంటలు కూరగాయల పంటలకు రూ. 25వేలు చొప్పున పంట నష్టం చెల్లించింది. ఎకరాకు రూ.10వేలు పరిహారం అందించడం కూడా ఇదే కూటమి ప్రభుత్వమేనని వారు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు రైతులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సందడి



పెదప్రోలు (మోపిదేవి), న్యూస్‌టుడే: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో అభిమానులు పెదప్రోలు, మోపిదేవి నాలుగు రోడ్ల కూడలిలో సందడి చేశారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేసి బాణసంచా కాల్చారు. ఆర్ఆర్ఆర్ తర్వాత చాలా కాలానికి ఎన్టీఆర్ సినిమా విడుదల కావడంతో, కూటమి ప్రభుత్వం అధిక ఉదంత ప్రదర్శనకు అనుమతివ్వడంతో అభిమానుల్లో కోలాహలం నెలకొంది.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నాగాయలంక, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ పోటీల ఎంపిక గురువారం స్థానిక జడ్పీ పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎంపికలో నాగాయలంక జడ్పీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి అండర్ 14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న సభ్యులు

నాగాయలంక, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం రాత్రి నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బి.కనకారావు, బీజే గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి ఎన్.వెంకటేశ్వరరావు సమక్షంలో కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా తెనాలి శ్రీనుబాబు, గౌరవాధ్యక్షుడిగా సజ్జనేని బాబూ భవానీవరప్రసాద్, సహ అధ్యక్షుడుగా పీతా వీర వెంకటేశ్వరరావు, సహ అధ్యక్షురాలుగా మండల నాంచారమ్మ, ప్రధాన కార్యదర్శి బండ్రెడ్డి సాంబశివరావు, కోశాధికారి మద్ది శ్యామల, ఆడిటర్ కొల్లూరి నాగేశ్వరరావు, ఆపీస్ ఇన్‌ఛార్జి సజ్జనేని సురేష్‌బాబు ఎన్నికయ్యారు.

కొనకళ్లకు శుభాకాంక్షలు

కూచిపూడి, న్యూస్‌టుడే: ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును మొవ్వ మండల తెదేపా ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి గురువారం శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, నాయకులు కొసరాజు ప్రభాకరావు, వేమూరి వెంకటేశ్వరరావు, పి.నాని, లింగమనేని రవి, పునుకొల్లు సునీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వాన్ని ఆదరించండి

ఘంటసాల, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం శ్రీకాకుళంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం అరాచక పాలనను వ్యతిరేకించిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా ఎక్కువగా జరిగిందని ఆరోపించారు. తహసీల్దారు విజయప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు, ఈవోపీఆర్డీ కిషోర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వేదికపై కూటమి నాయకులు, అధికారులు



ప్రభుత్వ పనితీరు వివరిస్తున్న నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు

మోపిదేవిలో 'ఇది మంచి ప్రభుత్వం'

మోపిదేవి, న్యూస్‌టుడే: మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించి, అండదండలు అందించాలని తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని మండల పరిషత్ ఆవరణలో పరిషత్ అధ్యక్షులు రావి దుర్గావాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. వరద సాయాన్ని కేవలం 20రోజుల్లోనే రైతులకు అందించామన్నారు. సర్పంచులు, తెదేపా మండల అధ్యక్షులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయ డీసీ బాధ్యతల స్వీకరణ



మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత శోభ, భక్తి భావాలు పెంపొందించేందుకు, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వసతులను సమకూర్చేలా తన పనితీరు ఉంటుందని చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పూర్వపు ఈవో నల్లం సూర్యచక్రధరరావు నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనలు, సలహాలు పాటిస్తూ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్లు శుభ్రం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్లు దుర్వాసనతో కంపు కొడుతున్నాయన, మరుగు దొడ్లకు వెళ్లాలంటే కంపరం పుడుతోందని ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఈనెల 23న ఈనాడులో 'కంపు కొడుతున్నా రుసుం చెల్లించాల్సిందేనా!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మరుగుదొడ్లను పరిశుభ్రం చేయించారు.

స్పందనకు వందనం



2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో వేసిన రంగులు



వైకాపా పాలనలో పర్యవేక్షణ లేక ఇలా వెలిసిపోయి..

సొరంగం దుర్గంధం

విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు 2018 సంవత్సరంలో నగరంలో సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా వన్‌టౌన్‌లోని సొరంగం గోడలకు రంగులు వేశారు. విద్యుద్దీపాలు అమర్చారు. పాదచారుల బాటను చక్కగా తీర్చిదిద్దారు. అందంగా ముస్తాబు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ పాలనలో పట్టించుకోలేదు. నిర్వహణను గాలికివదిలేసింది. గోడలకు బెల్లులు ఏర్పడ్డాయి. నీరు లీకేజీ అవుతూ.. ప్రయాణికుల మీద పడుతున్నాయి. రంగులు వెలిసిపోయి పాడైపోయాయి. గోడలన్నీ పాచిపట్టాయి. దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి సొరంగానికి పూర్వ వైభవం తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

– ఈనాడు, అమరావతి



యాచకులకు అడ్డాగా..



గోడల్లో నీరు లీకై అపరిశుభ్రంగా..

తక్షణం దిగిపోండి.. రెండేళ్లు అవకాశం ఇవ్వండి

విజయ డెయిరీ ఛైర్మన్ వ్యవహారం ● విజయవాడలో నేతల కీలక సమావేశం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

విజయ డెయిరీ ఛైర్మన్ మార్పు వ్యవహారం రసకందాయంలో పడింది. ప్రస్తుత ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెదేపాకు విధేయుడిగా, ప్రత్యక్ష రాజకీయాల్లో పని చేయలేకపోయినా ఆర్థికంగా పలు పనులు వచ్చిన నేపథ్యంలో ఆయనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ పెద్దలు ఇప్పటికే సూచించిన సంగతి తెలిసిందే. ఈ నెల 30 లోగా రాజీనామా చేయవలసిందిగా చలసానికి గడువు కూడా విధించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. కానీ బుధవారం ఆంజనేయులు రాజీనామా చేస్తారా.. డైరెక్టర్ల ఆత్మీయ సమావేశంలో సీఎం చంద్రబాబును కలిసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలంటూ తీర్మానించడంతో వ్యవహారంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలో గురువారం విజయవాడలోని ఓ హోటల్లో మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని), కృష్ణాజిల్లా తెదేపా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, చలసాని ఆంజనేయులు, విజయ డెయిరీ డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ఛైర్మన్ పదవి నుంచి ఆంజనేయుల్ని తప్పించాలన్నది అధిష్ఠానం నిర్ణయమని, దీని ప్రకారమే అందరూ నడుచుకోవాలని మంత్రి, ఎంపీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రతికూల ప్రభుత్వం, కరోనా సమయంలో ఆంజనేయులు ఆధ్వర్యంలో డెయిరీ పురోగతి సాధించిందని, అధునాతన యూనిట్లను కూడా నిర్మించుకోగలిగామని, మరో రెండేళ్లయినా ఆయన్ను కొనసాగించాలని కొందరు డైరెక్టర్లు విజ్ఞప్తి చేశారు. పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ కట్టుబడి ఉండాలని, తక్షణం చలసాని పదవి నుంచి వైదొలగాల్సిందేనని నేతలు స్పష్టం చేశారు. పార్టీ జెండా పట్టుకుని ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనాల్సిన ఆంజనేయులుకు తామే సూచించామని, మండవ జానకిరామయ్య తరహాలోనే రాజకీయాలకతీతంగా యూనియన్‌ను నడపాల్సిన విషయం చెప్పామని, అంతే తప్ప ఆంజనేయులు తెదేపాకు వ్యతిరేకంగా వ్యవహరించ లేదంటూ డైరెక్టర్లు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. ఆంజనేయులు మాత్రం చంద్రబాబు కారణంగానే తనకు పదవి వచ్చిందని, ఆయన చెబితే రాజీనామా చేయడానికి సిద్ధమంటూ అన్నట్లు సమాచారం. డైరెక్టర్ల అభిప్రాయాలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పి నేతలు సమావేశాన్ని ముగించారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరానికి వినోదం కావాలె..!



అమ్మ.. ఇంటి పనుల్లో తలమునకలవుతోంది..
నాన్న.. బరువు బాధ్యతల్లో మునిగితేలుతున్నాడు..
పిల్లలు.. పుస్తకాలతో కుస్తీపడుతున్నారు..
యువత.. ప్రపంచంతో పోటీ పడుతున్నారు..
ఉద్యోగి.. పని ఒత్తిడితో చిత్తవుతున్నాడు..

ఇలా.. అందరూ రోజువారి దినచర్యలో పడి... ఆహ్లాదానికి దూరమైపోతున్నారు. అన్ని వర్గాల ప్రజల మానసిక వికాసానికి పర్యాటక రంగం ఎంతో తోడ్పడుతుంది. ఈ రంగాన్ని గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

- భవానీపురం, న్యూస్‌టుడే

⬇ సేదతీరే వనాలు అవసరం ⬇ దర్శనీయ ప్రదేశాలపై దృష్టిపెట్టాలి.. ⬇ ప్రపంచ పర్యాటక దినోత్సవం నేడు

దీవిపాన్ని అద్వితీయంగా తీర్చిదిద్దాలి..

విజయవాడ నగరం చెంత కృష్ణా నదిలోని భవానీద్వీపం సహజ సిద్ధమైనది. దీని అభివృద్ధికి నాటి తెదేపా ప్రభుత్వ హయాంలో అంకురార్పణ చేశారు. అమరావతి రాజధాని బృహత్ ప్రణాళికలో భాగంగా.. ప్రత్యేకంగా బీఐటీఎస్(భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్)ను ఏర్పాటు చేశారు. రూ.12 కోట్ల వ్యయంతో నది ఒడ్డున లేజర్‌షో, వాటర్ ఫౌంటెన్‌లు వంటివి ఏర్పాటు చేశారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ గత వైకాపా ప్రభుత్వం.. వాటిని పక్కనెట్టింది. స్తూపం దెబ్బతిన్నా పట్టించుకోలేదు. 2019లో వరదలతో పాడైన ఫౌంటెన్, లేజర్‌షోలను మరమ్మతులు చేయలేదు. ఫౌంటేన్‌కు బీమా సదుపాయం ఉందని అధికారులు చెప్పినప్పటికీ.. మిన్నకుండిపోయింది.



తాళ్లపై సాహసం..



ప్రకాశం బ్యారేజీ సమీపంలో కృష్ణానదిపై రోప్‌వే నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. గతంలో పలు పర్యాయాలు అంచనాలు రూపొందించారు. తర్వాత విస్మరించారు. తొలుత ఇంద్రకీలాద్రి మీద నుంచి భవానీద్వీపానికి రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి దేవస్థానం అధికారుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. పున్నమి ఘాట్ నుంచి కృష్ణానదిపై నిర్మించాలని సంకల్పించారు. భవానీద్వీపంతో పాటు కొండపల్లి కోటకు రోప్‌వే నిర్మిస్తామని పర్యాటక శాఖ అధికారులు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల్లో కదలిక తీసుకురావాలి.

పూర్వవైభవం తేవాలి..





ఎన్టీఆర్, కృష్ణాజిల్లా పరిధిలో అనేక పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. విజయవాడ నగరానికి సమీపంలోనే కొండపల్లి ఖిల్లా ఉంది. గత ప్రభుత్వం దీని అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. గాంధీహిల్‌ను పూర్తిగా విస్మరించారు. మచిలీపట్నం బీచ్, కాటేజీల నిర్మాణం, సందర్శకుల సౌకర్యాలపై ప్రతిపాదనలను పక్కన పడేశారు. పవిత్ర సంగమం, ఇబ్రహీంపట్నంలో బటర్‌ఫ్లై ఉద్యానాలను విస్మరించారు. నగర పరిధిలో బాపు మ్యూజియాన్ని సందర్శకులు రాకుండా చేశారు. మ్యూజియం ప్రవేశ రుసుం రూ.50లు చేయడంతో... సందర్శకులు తగ్గిపోయారు. 2014-19 తెదేపా హయాంలో నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారిని ఆకర్షించేలా కృష్ణానదిపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎఫ్1 హెచ్2ఓ బోట్ల పోటీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ఎయిర్‌షో, నావికా దళ సిబ్బంది విన్యాసాలు అలరించాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

రాజధాని నగరమైన విజయవాడలో మరిన్ని పర్యటక ప్రాజెక్టులు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రజలు సేదతీరేందుకు ఉద్యానాలు పెంచాలి. వినోద కార్యక్రమాలు పెరగాలి. ఉద్యోగులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందే.. ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పాలి. పిల్లలు, పెద్దలు.. ఇలా అన్ని వర్గాల మానసిక వికాసాన్ని కలిగించే రకరకాల ఆటలు ఉండాలి. మరుగునపడిన పర్యటక ప్రాంతాలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాణిపాకం వినాయకుడికి పట్టు వస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక దేవస్థానం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలను గురువారం సమర్పించారు. దుర్గగుడి ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, ఏఈవో వెంకటరెడ్డి పర్యవేక్షణలో వైదిక కమిటీ సభ్యుల బృందం పట్టు వస్త్రాలు, సారె తీసుకు వెళ్లారు. కాణిపాక దేవాలయ అధికారులు మేళతాళాలతో వారికి స్వాగతం పలికారు. దేవస్థానం ఈవో గురుప్రసాద్‌కు పట్టువస్త్రాలు, సారె అందజేశారు. కాణిపాకం దేవస్థాన వేద పండితులు కమిటీ సభ్యులకు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేశారు.



పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, ఏఈవో వెంకటరెడ్డి, వైదిక కమిటీ సభ్యులు

భారీ ర్యాలీగా మంగళగిరికి

జగ్గయ్యపేట: వైకాపాకు రాజీనామా చేసి జనసైనికుడిగా మారిన మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను జగ్గయ్యపేటలోని ఆయన అభిమాన శ్రేణుల నుంచి మద్దతు లభించింది. గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరేందుకు జగ్గయ్యపేట నుంచి వాహనాల్లో అభిమానులు, నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మధ్యాహ్నం జగ్గయ్యపేటలోని ఉదయభాను ఇంటి వద్ద నుంచి ఆయన కుమారులు సామినేని వెంకట కృష్ణప్రసాద్, ప్రశాంత్‌బాబులతో పాటు ముఖ్యనాయకులు తరలివెళ్లారు. తనకు మద్దతు పలికిన నాయకులు, శ్రేణులు, కార్యకర్తలందరికీ ఉదయభాను కృతజ్ఞతలు తెలియజేశారు.



అభిమానుల ప్రదర్శన

కార్పొరేషన్ ఛైర్మన్లకు అభినందన

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.సత్యనారాయణ, హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బి. తాతయ్యబాబు గురువారం మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నియమించిన ఛైర్మన్లు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని వెంకన్న సూచించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలంకారీ కార్పెట్ల అందాలు

పెడనలో తయారీ.. వరంగల్‌లో విక్రయం

న్యూస్‌టుడే, పెడన

కలంకారీ కార్పెట్లు భౌగోళిక గుర్తింపు పొందాయి. వరంగల్‌లో మగ్గాలపై రూపుదిద్దుకునే ఈ కార్పెట్లను పెడన తీసుకొచ్చి కలంకారీ ప్రింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దుతారు. కలంకారీ ప్రింటింగ్ పూర్తయిన వాటిని తిరిగి వరంగల్ పంపిస్తారు. అక్కడి నుంచి దేశ విదేశాలకు ఎగుమతులు జరుగుతాయి.

కలంకారీ కార్పెట్లకు వరంగల్‌లోని కొత్తవాడలో కొన్ని కుటుంబాలు మగ్గాలపై రూపుదిద్దుతారు. వివిధ సైజుల్లో వచ్చే ఈకార్పెట్లను అక్కడి ఉత్పత్తిదారులు కలంకారీ ప్రింటింగ్ నిమిత్తం పెడనకు పంపిస్తారు. ఇక్కడ కార్పెట్లను ప్రత్యేకంగా ప్రింటింగ్ చేసే కుటుంబాలు కలంకారీ హస్తకళగా మార్చి మార్కెటింగ్‌కు సిద్ధం చేస్తారు. దేశ విదేశాల్లో జరిగే ఎగ్జిబిషన్లలో కలంకారీ కార్పెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇక్కడి కళాకారుల నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తాయి. అయితే శ్రమతో కూడిన ఈ ప్రింటింగ్‌ను చేసే కార్మికులు పెడనలో ఏటికేడాది తగ్గిపోతున్నారు. గతంలో వందల సంఖ్యలో కార్మికులు ఉండగా ప్రస్తుతం పదుల సంఖ్యకు తగ్గారు.



ప్రింటింగ్ చేస్తున్న కార్మికుడు

ఇంటీరియర్ డెకరేటర్‌గా..

కలంకారీ కార్పెట్లను ఇంటీరియర్ డెకరేటర్‌గా వినియోగిస్తారు. ఇంటీరియర్ డిజైనర్లు ఈ కార్పెట్లను వినియోగించడంలో ఆసక్తిని చూపిస్తున్నారు. వివిధ సైజుల్లో అందుబాటులో ఉన్న వీటిని ఇంటిలోపలి అందాలను మరింతగా ఇనుమడింప చేస్తున్నాయి. ప్రకృతి సిద్ధమైన రంగులైన కరక్కాయ, నల్లబెల్లం, మోదుగపువ్వు, దానిమ్మ బెరడులతో రూపుదిద్దుకుంటూ హస్తకళా ప్రియుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బెంగళూరు, దిల్లీ, హైదరాబాద్, చెన్నై తదితర నగరాల్లోని ప్రధాన హస్తకళా షోరూంల్లో వీటిని విక్రయాలకు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ హస్తకళల అభివృద్ధి సంస్థలైన లేపాక్షి, గోల్కొండ షోరూముల్లో కూడా ప్రముఖంగా విక్రయిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైలు ప్రయాణికులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా ప్రచారంలో భాగంగా విజయవాడ డివిజన్ వ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, రైళ్లలో ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడొద్దని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతలో లోపాలు ఉంటే ప్రయాణికులు 139లో ఫిర్యాదు చేయాలని కోరారు. అధికారులు విజయవాడ రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాంట్రీ కార్లు, క్యాంటీన్లు, స్టాళ్లు, క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విక్రయదారుల గుర్తింపు కార్డులు పరిశీలించారు.



ఆహారపదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రసాదాల నాణ్యతపై పర్యవేక్షణ ఏది?

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లడ్డూ ప్రసాదాల నాణ్యతపై నీలినీడలు అలముకున్నాయి. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలిసిన నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్వయంగా ఆలయంలోని ప్రసాదం పోటులో ఆకస్మికంగా తనిఖీలు చేసిన విషయం విదితమే. లడ్డూ తయారీలో ప్రధానమైన నెయ్యి, జీడిపప్పు, శెనగపప్పు నాసిరకంగా ఉన్నట్లు ఆయన గుర్తించి వాటిని పరీక్షలకు పంపాలని ఈవోను ఆదేశించారు. గత వైకాపా పాలన ఐదేళ్లలో తిరుపతమ్మ ఆలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం, పాలకవర్గాలు దృష్టి సారించక పోవడంతో లడ్డూ ప్రసాదాల తయారీపై పర్యవేక్షణ కరవైంది.



ఆలయంలో తయారవుతున్న లడ్డూలు

ఏడాదికి రూ. కోటి విలువైన సరకులు కొనుగోలు

తిరుపతమ్మ దేవాలయానికి ఏడాదికి 50 లక్షల మంది భక్తులు వస్తుంటారు. 12 లక్షల లడ్డూ ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేస్తారు. ప్రసాదాల తయారీ సరకుల కొనుగోలు దేవస్థానం ఏడాదికి రూ. 1.10 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ సరకులను టెండర్ విధానంలో కొనుగోలు చేస్తోంది. కొనుగోలు చేసే పదార్థాల్లో నెయ్యి, జీడిపప్పు, శెనగపిండి, కిస్మిస్, యాలుకలు, లవంగాలు, బియ్యం, పంచదార, ఇతర పదార్థాలు ఉన్నాయి. ప్రసాదాల తయారీ పదార్థాల కొనుగోలు, నిల్వ చేయడం, రోజూ వారి నిర్వహణకు ఒక సూపరింటెండెంట్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పలువురు ఉద్యోగులు పని చేస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

దేవస్థానానికి కావాల్సిన పదార్థాలను టెండర్ విధానంలో కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఏడాది ఒక సారి మాత్రమే టెండర్ పిలిచేవారు, దానిని కొంతకాలంగా 6 నెలలకు కుదించారు. దేవాదాయ శాఖ రూపొందించిన టెండర్ షెడ్యూల్ ప్రకారం టెండర్‌లో పాల్గొనే ఏజెన్సీల్లో ఎవరైతే తక్కువ ధరకు కోడ్ చేస్తే వారికే టెండర్ దక్కుతోంది. మంచి సరకు సరఫరా చేయాల్సి ఉన్నా, తక్కువ ధర కోడ్ చేయడంతో ఏజెన్సీ వారు నష్టపోకుండా ఉండటం కోసం నాసిరకం సరకులు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ కొరవడి

గడిచిన ఐదేళ్లుగా అమ్మవారి దేవాలయానికి రెగ్యులర్ ఈవో లేరు. ఈవోగా ఎవరూ వచ్చినా ఇతర దేవాలయాల్లో విధుల్లో ఉన్నవారినే నియమించడంతో వారు స్థానికంగా ఉండడం లేదు. ఆలయానికి అప్పుడప్పుడు వస్తు పోతున్నారు. కొన్నేళ్లుగా ఈ-ఫైల్ విధానం అమల్లోకి రావడంతో ఆలయానికి రాకుండానే సంతకాలు చేస్తూ పాలన సాగించారు. దేవాలయానికి పాలకవర్గాలు ఉన్నా ఛైర్మన్, సభ్యులకు సరైన అవగాహన లేకపోవడంతో పరిశీలన, పర్యవేక్షణ లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులర్ ఈవోను నియమించాలని ఆలయ ఉద్యోగులు కోరుతున్నారు.

జలవనరుల శాఖలో బదిలీలు

మచిలీపట్నం (కోనేరుసెంటరు): సాధారణ బదిలీలపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో జలవనరుల విభాగంలో పనిచేస్తున్న పలువురు ఈఈలను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో బదిలీ అయిన వారి వివరాలు..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఆర్ అప్పారావు	విస్సన్నపేట పులిచింతల సర్కిల్	జంగారెడ్డిగూడెం, పీఐపీహెచ్‌డబ్ల్యూ డివిజన్ నెం.8
పి. వెంకటేశ్వర్లు	విజయవాడ హైడ్రాలజీ విభాగం	పీఐపీఆర్ఎంసీ డివిజన్ నెం.5, విజయవాడ, ఎన్ఎస్ఎల్‌సీ సర్కిల్
వి. శివరామప్రసాద్	ప్రాజెక్టు డివిజన్‌నెం.2, పులిచింతల సర్కిల్	పీపీ డివిజన్-4 పులిచింతల ప్రాజెక్టు సర్కిల్
వి. కృష్ణారావు	పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు	విశాఖ డీఎస్ఈ
ఆర్ విఠల్‌ప్రసాద్	హైడ్రాలజీ విభాగం, విజయవాడ	కమిషనరేట్ ఆఫ్ టెండర్స్, విజయవాడ
బి. శ్యామ్‌ప్రసాద్	డీసీఈ, కృష్ణాడెల్టా సిస్టమ్స్, విజయవాడ	గుంటూరు హైడ్రాలజీ విభాగం
బి. శ్రీనివాసరావు	నీరు-ప్రగతి, విజయవాడ	పీడబ్ల్యూ వర్క్‌షాప్, సీతానగరం
ఎ. సురేష్	హైడ్రాలజీ విభాగం, విజయవాడ	నీరు-ప్రగతి, విజయవాడ
ప్రసాద్‌రెడ్డి	కమిషనరేట్ ఆఫ్ టెండర్స్, విజయవాడ	ఇరిగేషన్ విభాగం, కడప
కె. రమేష్	ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ	పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ప్రత్యేక అధికారి

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ యువతి రోడ్డుపై పడిపోగా.. లారీ ఎక్కేసింది. అక్కడికక్కడే ఆమె దుర్మరణం పాలైన ఘటన నున్న గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర శివారులోని కండ్రికకు చెందిన షేక్ మరియంబి (20) గన్నవరం మండలం సూరంపల్లిలో డీజే బాక్సులు తయారు చేసే కంపెనీలో పనిచేస్తున్నారు. అదే కంపెనీలో సుంకర వాణి పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం వాణి తన భర్త వాహనంపై ఇంటికి వెళుతూ మరియంబిని ఎక్కించుకున్నారు. బోడపాడు ఆంజనేయ స్వామి గుడి వద్ద లారీని దాటుకుని ముందుకు వెళుతుండగా.. ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. వాణి, మరియంబీలు రోడ్డుపై పడిపోయారు. లారీ మరియంబీపై ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందారు. వాణికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై మృతురాలి భర్త షేక్ సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఇద్దరు స్నేహితుల మృతి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే : రైలు ఢీకొని ఇద్దరు స్నేహితులు మృతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రామవరప్పాడుకు చెందిన మోరం దిలీప్ (17) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడు పట్నాల తేజా పద్మ కళాధర్(19) తో కలిసి బుధవారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. గురువారం ఉదయం రైల్వే సిబ్బంది సమాచారంతో గుడివాడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లడ్డూ కల్తీపై నిరసనలు రేపు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై భక్తుల మనోభావాల పరిరక్షణకు మహాదళ్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నట్లు మహాదళ్ సభ్యుడు గణేష్ మహారాజు తెలిపారు. గురువారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఖరి కారణంగా ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూ వ్యవహారంపై ప్రపంచవ్యాప్తంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలను పూర్తిగా ప్రక్షాళన చేయడంతో పాటు, కల్తీ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం నిరసన కార్యక్రమాల్లో హిందూ సంఘాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో న్యాయవాది రవి, కొర్రబోలు శ్రీనివాసరావు, పోతురాజు, మహాదళ్, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణేష్ మహారాజు. పక్కన రవి, శ్రీనివాసరావు, పోతురాజు



సుధాకర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

రైలు నుంచి జారిపడి.. తెల్లవార్లూ మృత్యు పోరాటం

రెండు కాళ్లు కోల్పోయిన యువకుడు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వెళ్లొస్తూ రైలు నుంచి జారిపడి రెండు కాళ్లూ కోల్పోయి రాత్రంతా వర్షంలో తడుస్తూ నరక యాతన పడిన ఓ యువకుడి హృదయవిదారకర సంఘటన ఇది. గుడివాడ రైల్వేస్టేషన్ ప్రాంతంలో నివాసం ఉండే బొమ్మసాని సుధాకర్(40) బుధవారం విజయవాడ వెళ్లి అదే రోజు రాత్రి రైలులో తిరిగి వస్తున్నాడు. రాత్రి 9.30 గంటలకు పట్టణంలోని దనియాలపేట ప్రణవాశ్రమం సమీపంలోకి రాగానే రైలు బోగీ గేటు నుంచి జారిపడి రెండు కాళ్లు మోకాళ్ల కిందకు తెగిపోయాయి. సుధాకర్‌ను రాత్రి ఎవరూ గుర్తించకపోవడం, ప్రయాణికులు, రైల్వే అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి కురిసిన వర్షానికి తడుస్తూనే తీవ్ర రక్తస్రావంతో అంతులేని వేదన అనుభవించాడు. ఉదయం 6 గంటలకు గ్యాంగ్‌మెన్ గుర్తించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు దనియాలపేట వంతెన నుంచి సుమారు కిలోమీటరు దూరం స్ట్రెచర్‌తో తీసుకెళ్లి గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అదే అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు.